ప్రజాశక్తి

శుక్రవారం 7 జూన్ 2024

8 పేజీలు

విశాఖపట్నం

అనకాపల్లి

కూటమిలో అమాత్యులెవరో ?

◆ భారీ మెజారిటీ, సీనియారిటీ, సామాజిక సమీకరణాల ప్రాతిపదికగా లెక్కలు

◆ ఊహల్లో విజేతలు

గంటా శ్రీనివాసరావు

పల్లా శ్రీనివాసరావు

విష్ణుకుమార్ రాజు

కొణతాల రామకృష్ణ

అనిత

అయ్యన్నపాత్రుడు

సత్యనారాయణమూర్తి

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో, అనకాపల్లి ప్రతినిధి

తాజా ఎన్నికల్లో గెలిచిన టిడిపి, జనసేన, బిజెపి కూటమికి చెందిన పలువురు నేతల్లో మంత్రి పదవులు ఎవరికి దక్కనున్నాయన్న చర్చ సర్వత్రా జరుగుతోంది. నూతన ప్రభుత్వం రాష్ట్రంలో ఈ నెల 12న ప్రమాణ స్వీకారోత్సవానికి సిద్ధమవుతున్న సంగతి తెలిసిందే. ఈ క్రమంలో విశాఖ జిల్లాలో తూర్పు, పశ్చిమ, గాజువాక, భీమిలి నియోజకవర్గాల్లో గెలుపొందిన టిడిపి అభ్యర్థులు, విశాఖ దక్షిణం నుంచి విజయం అందుకున్న జనసేన అభ్యర్థి, ఉత్తరం నుంచి గెలిచిన బిజెపి అభ్యర్థి ఎవరి లెక్కల్లో వారున్నారు. వీరంతా మంత్రి పదవులపై ఆశలు పెట్టుకుని అధిష్టానాలను ఆకర్షించే పనిలో పడ్డారు. విశాఖ జిల్లాలో 95235 ఓట్ల మెజారిటీని టిడిపి గాజువాక అభ్యర్థి పల్లా శ్రీనివాసరావు సాధించిన విషయం తెలిసిందే. ఆయన మాజీ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌పై గెలుపొందారు. అలాగే భీమిలి ఎమ్మెల్యేగా గంటా శ్రీనివాసరావు 92,401 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. గతంలో టిడిపి మంత్రివర్గంలో విద్యాశాఖ మంత్రిగా ఆయన పనిచేశారు. ఐదోసారి గెలుపొందారు. పల్లా శ్రీనివాసరావు రెండోసారే గెలిచినా రాష్ట్రంలోనే అత్యధికంగా ఎమ్మెల్యేల కేటగిరీలో మెజారిటీని సాధించారు. ఆయనకు సామాజిక సమీకరణాల రీత్యా ఈ దఫా మంత్రి పదవి వరించవచ్చు అన్న ఊహాగానాలు సాగుతున్నాయి. ఆయన కూడా మంత్రి పదవిపై ఆశలు పెట్టుకున్నారు. విశాఖ ఉత్తరం నుంచి బిజెపి అభ్యర్థిగా విష్ణుకుమార్ రాజు గెలవడంతో కూటమి భాగస్వామి అయిన ఆయన్ని సైతం మంత్రి పదవి వరిస్తుందా ? అనే చర్చ కూడా లేకపోలేదు. రాష్ట్రంలో పలుచోట్ల బిజెపి ఎమ్మెల్యేలు గెలిచినందున ప్రాధాన్యతా క్రమంలో ఆయనకు వస్తుందా ? రాదా ? అన్నది బిజెపి అధిష్టానంపై ఆధారపడి ఉంది. విశాఖ దక్షిణం నుంచి జనసేన అభ్యర్థి వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ గెలుపొందారు. గతంలో వైసిపి నుంచి తెగతెంపులు చేసుకుని పవన్ పక్షాన చేరిన ఆయన అనూహ్యంగా దక్షిణంలో గెలుపొందారు. ఆయన కూడా ఆశావహుల్లో ఒకరు. పల్లా శ్రీనివాసరావు, వంశీకృష్ణ ఒకే మిగతా 2లో..

మాట్లాడుతున్న లోకనాథం, చిత్రంలో జగ్గునాయుడు

అసైన్డ్ భూముల అన్యాక్రాంతంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు కె.లోకనాథం వార్త మెయిన్‌లో..

కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో

విశాఖ పోర్టుకు 18వ స్థానం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో : ప్రపంచ బ్యాంకు రూపొందించిన కంటైనర్ పోర్టు పనితీరు సూచీలో విశాఖపట్నం పోర్టు 18వ స్థానాన్ని సాధించింది. విశాఖ కంటైనర్ టెర్మినల్ ఈ నూతన మైలురాయిని చేరుకోవడంలో అద్భుతమైన ప్రతిభను కనబరిచిందని గురువారం పోర్టు కార్యదర్శి టి.వేణుగోపాల్ మిగతా 2లో..

మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చలు

▶ వార్త 2లో..

డ్యూటీ సర్టిఫికెట్ల కోసం యుటిఎఫ్ వినతి

▶ వార్త 2లో..

అనుసంధానం లేకపోవడంతోనే ఓటమి

▶ వార్త 5లో..

ఉక్కు దీక్షల్లో కూర్చున్న సిహెచ్.నర్సింగరావు, స్టీల్‌ప్లాంట్ కార్మికులు

ఉక్కు రక్షణకు కేంద్రంపై ఒత్తిడి తేవాలి

పోరాట కమిటీ చైర్మన్ సిహెచ్.నర్సింగరావు వార్త 2లో..

మానవ అక్రమ రవాణా కేసులో పురోగతి

◆ స్వదేశానికి చేరుకున్న 68 మంది భారతీయులు

◆ విశాఖ సిపి డాక్టర్ ఎ.రవిశంకర్

మీడియా సమావేశంలో వివరాలు వెల్లడిస్తున్న సిపి రవిశంకర్

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఇటీవల కాలంలో సంచలనం సృష్టించిన మానవ అక్రమ రవాణా కేసులో పురోగతి సాధించామని నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎ.రవిశంకర్ తెలిపారు. గురువారం సాయంత్రం తన కార్యాలయంలో ఆయన సమావేశం నిర్వహించారు. ఇటీవల కంబోడియా నుంచి నగరానికి చేరుకున్న నలుగురు బాధితులతో కలిసి ఏర్పాటు చేసిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు భారతదేశం నుంచి వెళ్లి కంబోడియాలో చిక్కుకుపోయిన 158 మంది భారతీయులను గుర్తించామని తెలిపారు. వారిలో ఇప్పటి వరకూ 68 మందిని భారతదేశానికి తిరిగి తీసుకొచ్చామన్నారు. ఇంకా 90 మంది అక్కడే ఉన్నారని తెలిపారు. వారిలో 25 మంది భారతదేశానికి తిరిగి రావడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. భారతదేశానికి తిరిగి వచ్చిన వారిలో 28 మంది విశాఖ వాసులని వెల్లడించారు. ఈ కేసు విచారణ క్రమంలో దేశవ్యాప్తంగా ఉన్న 21 మంది ఏజెంట్లను గుర్తించామని, వారిలో 11 మంది విశాఖ వారు ఉన్నారని తెలిపారు. మానవ అక్రమ రవాణా మాత్రమే కాకుండా సిమ్ కార్డ్ సప్లైకి సంబంధించి కూడా పెద్ద స్కాం నడుస్తోందని తెలిపారు. ఇండియా నుండి సిమ్ కార్డులు కొనుగోలు చేసి వాటిని కంబోడియాలో 10 వేల నుండి 15 వేలకు అమ్ముతున్నారని తెలిపారు. దీనికి సంబంధించి ముగ్గురు నిందితులను గుర్తించామని, వారిలో ఇద్దరు ఆంధ్రప్రదేశ్ వారు కాగా.. ఒకరు ఒడిశాకు చెందినవారని అన్నారు. ఆరుగురు ఏజెంట్లపై ఇప్పటికే లుక్ అవుట్ సర్క్యులర్ విడుదల చేశామన్నారు. భారతదేశం నుంచి వివిధ స్కాముల ద్వారా సేకరించిన సొమ్మును బిట్ కాయిన్‌లుగా మార్చి చైనాకు చేరవేస్తున్నారని తెలిపారు. కంబోడియాలో చిక్కుకున్న వారు ఎవరైనా భారతదేశానికి రావాలనుకుంటే తమను సంప్రదించాలని, మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

కూటమిలో అమాత్యులెవరో ?

సామాజిక తరగతి అయినందున ఇద్దరిలో ఎవరో ఒకరికే మంత్రి పదవి దక్కే ఛాన్స్ ఉంటుందన్న చర్చ నడుస్తోంది. ఈ నేపథ్యంలో గెలిచిన వారంతా మంత్రి పదవుల సాధ్యాసాధ్యాలపై ఎవరి ప్రయత్నాలు వారు చేస్తున్నారు.

అనకాపల్లి జిల్లాలో ఎవరికి దక్కేనో..?

- రేసులో అయ్యన్న, అనిత, బండారు, కొణతాల

కూటమి ప్రభుత్వంలో అనకాపల్లి జిల్లాలోని టిడిపి, జనసేనలో ఎవరికి మంత్రివర్గంలో చోటు దక్కుతుంది ? ఏ పార్టీ నుంచి ఎవరికి అవకాశం వుంటుంది ? అన్న ఆసక్తి నెలకొంది. మంత్రివర్గ కూర్పులో ఏ సామాజిక తరగతుల్లో ఎవరికి స్థానం వుంటుంది ? సీనియార్టీని పరిగణనలోకి తీసుకుంటారా ? విధేయతకు ప్రాధాన్యత ఇస్తారా ? సామాజిక తరగతి కొలబద్ధలో ఎవరికి ఎక్కువ అవకాశం వుంటుందన్న చర్చ నడుస్తోంది. కూటమి భాగస్వాముల్లో టిడిపిలో నలుగురు, జనసేనలో ఇద్దరు ఎమ్మెల్యేలుగా గెలిచారు. వీరిలో టిడిపి నుంచి నర్సీపట్నం ఎమ్మెల్యే సిహెచ్.అయ్యన్నపాత్రుడు, మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి, పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనిత మంత్రి పదవి లభిస్తుందని ఆశతో వున్నారు. జనసేన నుంచి అనకాపల్లి ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ ధీమాగానే వున్నారు. జనసేనలో చేరిక సమయంలో అధికారంలోకి వస్తే మంత్రి పదవి ఇస్తామని కొణతాలకు ఆ పార్టీ అధినేత పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. జనసేన కోటాలో కొణతాలకు మంత్రి పదవి ఖాయమన్న ప్రచారం జరుగుతోంది. టిడిపిలో మంత్రి పదవులు ఆశిస్తున్న ముగ్గురు ఎమ్మెల్యేల్లో అయ్యన్న, బండారు ఒకే సామాజిక తరగతికి చెందిన వారు కావడంతో అయ్యన్న ఒక్కరికే మంత్రి పదవి రానున్నట్లు తెలుస్తోంది. మహిళ, ఎస్‌సి కోటాలో పాయకరావుపేట ఎమ్మెల్యే వంగలపూడి అనితను మంత్రివర్గంలోకి తీసుకునేందుకు అవకాశం వుంది.

విశాఖ పోర్టు (ఫైల్ ఫొటో)

విశాఖ పోర్టుకు 18వ స్థానం

వెల్లడించారు. సూచీలో మెరుగైన స్థానం దక్కడానికిగల కారణాలను వివరించారు. 'స్థానిక కంటైనర్ టెర్మినల్ నేపాల్ ఆధారిత కంటైనర్లకు గేట్ వే పోర్టుగా ఉంది. 65కు పైగా కంటైనర్ లైన్లు కలిగి ఉంది. ఎనిమిది నిరంతర సర్వీసులు ఉన్నాయి' అని ఆయన తెలిపారు. పోర్టు సాధించిన ఈ అసాధారణ విజయాన్ని స్టేక్ హోల్డర్లు, రైల్వేలు, కస్టమ్స్ వంటి ప్రభుత్వ రంగ సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం అభినందించాయి. భవిష్యత్తులో మరిన్ని రికార్డులు సాధించడానికి అవసరమైన సహాయ సహకారాలను అందిస్తామని హామీ ఇచ్చాయి. ఈ ఘనతను సాధించిన టెర్మినల్ నిర్వాహకులు, పోర్టు కుటుంబ సభ్యులను పోర్టు ఛైర్మన్ డాక్టర్ ఎం.అంగముత్తు ట్విట్టర్ ద్వారా అభినందించారు.

పోర్టు పని తీరు ప్రతిభావంతం

2023-24 ఆర్థిక సంవత్సరంలో విశాఖ పోర్టు సరుకు రవాణాలో అత్యంత ప్రభావవంతమైన పనితీరు కనబరిచి మేజర్ పోర్టులలో నాలుగో స్థానంలో నిలిచింది. 2024-25 ఆర్థిక సంవత్సరం మొదటి రెండు నెలల్లోనే సరుకు రవాణాలో 13.5 శాతం వృద్ధిని కనబరిచింది. విశాఖపట్నం పోర్టు సాధించిన ఘనత పట్ల కేంద్ర పోర్టులు, నౌక, జలరవాణా మంత్రిత్వ శాఖ సంతృప్తిని వ్యక్తం చేసింది.

మానవ అక్రమ రవాణా కేసులో పురోగతి

పాస్‌పోర్ట్ లేని వారు కంబోడియాలోని భారత దేశ దౌత్య కార్యాలయాన్ని సంప్రదిస్తే వారు తాత్కాలిక పాస్ పోర్టును అందజేసేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు. బాధితులు మాట్లాడుతూ తమను ఆంధ్రప్రదేశ్ నుండి తెలిసినవారు కంబోడియాలో కంప్యూటర్ ఆపరేటర్ ఉద్యోగాలు ఇప్పిస్తామని అక్కడికి తీసుకెళ్లారన్నారు. అనంతరం కంబోడియాకి చెందిన కంపెనీలకు 4 వేల నుండి 6 వేల డాలర్లకు విక్రయించారన్నారు. వారు ఒక వారం పాటు ట్రైనింగ్ ఇచ్చి అనంతరం భారతదేశానికి చెందిన వ్యక్తులను పలు రకాల స్కామ్‌ల ద్వారా మోసం చేసేందుకు ఉసిగొల్పారన్నారు. వివిధ మార్గాల ద్వారా భారతీయులను ఆర్థికంగాను, మానసికంగాను బలహీనపరిచి భారత ఆర్థిక వ్యవస్థను విచ్ఛిన్నం చేయటమే ప్రధాన లక్ష్యంగా పలు సంస్థలు కంబోడియాలో పని చేస్తున్నాయని వారు వివరించారు. అక్కడ వారు చెప్పినట్టు పనిచేసే భారతీయులను మోసం చేస్తే లక్షల్లో ఇన్సెంటివ్ ఇస్తారని, పనిచేయని వారిని డార్క్ రూముల్లో పడేసి 2-3 రోజులు ఆహారం అందించకుండా చిత్రహింసలకు గురిచేస్తుంటారని తెలిపారు.

ఇటీవల ఛేదించిన కేసులు

గడిచిన నెలరోజుల్లో రెండు హనీ ట్రాప్ కేసులను నగర పోలీసులు ఛేదించారని క్రైమ్ బ్రాంచి ఇన్‌స్పెక్టర్ కె.భవానీ ప్రసాద్‌రావు తెలిపారు. వారిలో ఒక వ్యక్తి దగ్గర నుంచి రూ.46.6 లక్షలు, మరొక వ్యక్తి దగ్గర నుంచి కోటి 12 లక్షలు సొమ్మును హనీ ట్రాప్ ద్వారా కంబోడియాకి చెందిన వ్యక్తులు కాజేసారని తెలిపారు. ఎవరైనా తెలియని వ్యక్తులు అమ్మాయిల ప్రొఫైల్ పిక్‌తో మెసేజ్ పంపిస్తే వాటికి స్పందించవద్దని ఆయన ప్రజలను కోరారు.

మున్సిపల్ కార్మికుల సమస్యలపై చర్చలు

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మున్సిపల్ కార్మికుల పెండింగ్ సమస్యలపై జివిఎంసి కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) విశాఖ జిల్లా బాధ్యులు గురువారం జివిఎంసి సిఎంహెచ్ డాక్టర్ నరేష్ కుమార్‌తో జివిఎంసి కార్యాలయంలో చర్చించారు. చర్చల సందర్భంగా సిఎంహెచ్ డాక్టర్ నరేష్ కుమార్ మాట్లాడుతూ సేఫ్టీ పరికరాలు, రైన్ కోట్లు, సబ్బులు, కొబ్బరినూనె, యూనిఫారం, మాస్కులు, గ్లౌజులు, గమ్ము బూట్లు ఇస్తామని అన్నారు. చనిపోయిన కార్మికుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా, సాధారణ మరణానికి రూ.2 లక్షలు, ప్రమాదంలో మరణిస్తే రూ.7 లక్షలు చెల్లిస్తామన్నారు. అలాగే బకాయి హెల్త్ అలవెన్స్, మిస్సింగ్ జీతాలు, మిగిలి ఉన్న కార్మికులకు ఐడి కార్డులు జారీ చేస్తామన్నారు. రిటైర్మెంట్ 60 సంవత్సరాలకు కాకుండా 62 సంవత్సరాలకు అమలు చేస్తామన్నారు. డెత్, 60 సంవత్సరాలు దాటిన, లాంగ్ ఆబ్సెంట్ పోస్టుల్లో భర్తీకి దరఖాస్తులు చేసుకోవాలన్నారు. నూతన ప్రభుత్వం మార్గనిర్దేశకంలో పని చేస్తామన్నారు. చర్చల్లో యూనియన్ అధ్యక్షులు టి.నూకరాజు, ప్రధాన కార్యదర్శి ఉరుకూటి రాజు, నాయకులు గొలగాని అప్పారావు, ముద్దాడ ప్రసాద్, జెఆర్.నాయుడు పాల్గొన్నారు.



సిఎంహెచ్‌తో చర్చలు జరుపుతున్న నాయకులు

డ్యూటీ సర్టిఫికెట్ల కోసం యుటిఎఫ్ వినతి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : ఎన్నికల్లో హోమ్ ఓటింగ్, పోలింగ్ డే, కౌంటింగ్‌లలో పాల్గొన్న ఉపాధ్యాయ సిబ్బందికి డ్యూటీ సర్టిఫికెట్లు మంజూరు చేసేలా చర్యలు తీసుకోవాలని డిఆర్ఒ కె.మోహన్ కుమార్‌కు యుటిఎఫ్ జిల్లా నాయకులు గురువారం వినతిపత్రం అందజేశారు. అందుకు సానుకూలంగా స్పందించిన ఆయన తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. డిఆర్ఒను కలిసిన వారిలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్షులు దాసరి నాగేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి టిఆర్.అంబేద్కర్, జిల్లా కోశాధికారి కె.రాంబాబు ఉన్నారు.

డిఆర్ఒకు వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఎయును ప్రక్షాళన చేయాలి

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ : ఎయును తక్షణం ప్రక్షాళన చేయాలని ఎపి నిరుద్యోగ జెఎసి రాష్ట్ర అధ్యక్షులు, ఎయు విద్యార్థి నాయకుడు సమయం హేమంత కుమార్ అన్నారు. పసుపు నీళ్లతో ఆంధ్ర విశ్వవిద్యాలయం ముఖ ద్వారాన్ని ఆయన గురువారం శుద్ధి చేశారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ యువతను మోసగించిన ప్రభుత్వానికి తగిన శాస్తి జరిగిందన్నారు. ఎయులో 19 కోర్సులను ఎత్తివేసి విద్యార్థులను చదువుకు దూరం చేశారన్నారు. వీసి ఆగడాలను వివరించారు.

చంద్రకు నివాళి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : కమ్యూనిస్టు అగ్రనేత చండ్ర రాజేశ్వరరావు 110వ జయంతి కార్యక్రమాన్ని అల్లిపురంలోని సిపిఐ కార్యాలయంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఆయన చిత్రపటం వద్ద నాయకులు నివాళ్లర్పించారు. కార్యక్రమంలో సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జెవి.సత్యనారాయణ మూర్తి, జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, కార్యవర్గ సభ్యులు జిఎస్‌జె.అచ్యుతరావు, ఎస్‌కె.రెహమాన్, ఎం.మన్మధరావు పాల్గొన్నారు.

మన్యంలో మలేరియా నివారణకు వైద్య బృందాలను పంపాలి

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్ : మన్యంలో మలేరియా జ్వరాల నివారణకు వైద్య బృందాలను పంపాలని భారత నాస్తిక సమాజం రాష్ట్ర అధ్యక్షులు టి.శ్రీరామమూర్తి, జిల్లా అధ్యక్షులు వై.నూకరాజు ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు, అనంతగిరి సహ పలు మండలాలలో వందలకొద్దీ గిరిజనులు మలేరియా, డెంగీ తదితర జ్వరాలతో బాధపడుతున్నారని తెలిపారు. 62 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గత ఐదు నెలల్లో 790 పాజిటివ్ కేసులు నమోదయ్యాయన్నారు. చింతూరు మండలంలో మోతుగూడెం, పోలూరు, తులసిపాక, లక్కవరం తదితర గ్రామాలలో ఎక్కువ మంది జ్వరాలతో బాధపడుతున్నట్లు వార్తలు వస్తున్నాయన్నారు. మన్యంలో జ్వర తీవ్రత ఎక్కువగా ఉన్న గ్రామాలు సమారు 2500 వున్నాయన్నారు. పాడేరు, రంపచోడవరం ప్రాంతాల్లోనూ జ్వర పీడితులున్నారన్నారు. పాడేరు సర్వజన ఆసుపత్రికి పెద్ద సంఖ్యలో బాధితులు వస్తున్నట్టు తెలిపారు. ఈ నేపథ్యంలో ఏజెన్సీ ప్రాంతాల్లో అవసరమైన వైద్య శిబిరాలు వెంటనే ఏర్పాటు చేయాలని, మంచి నీరు, పౌష్టికాహారం, దోమ తెరలు పంపిణీ చేయాలని కోరారు. వ్యాధి తీవ్రతవున్న వారిని విశాఖపట్నంలోని కెజిహెచ్ ఆసుపత్రికి తరలించాలని కోరుతూ జిల్లా కలెక్టర్‌కు, రాష్ట్ర వైద్యశాఖ అధికారికి భారత నాస్తిక సమాజం ద్వారా లేఖ పంపినట్లు తెలిపారు.

మహారాజశ్రీ అనకాపల్లి ప్రధాన సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

S.O.P. No. 1 / 2024

పిటీషన్: కొప్పాక మణికంఠ వగైరాలు . . . పిటీషనర్స్

అండ్: నిల్ . . . రెస్పాండెంట్స్

జనరల్ నోటీసు

పై నెంబరు కేసులో కొప్పాక రమణమ్మలు చనిపోయిన కారణంగా ప్రధానమంత్రి సురక్ష భీమా యోజన పథకం నుండి ఆమెకు రావలసిన సొమ్మును ఆమె కుమారుడు కొప్పాక నాగేశ్వరరావు తీసుకొనుటకు సక్ససన్ సర్టిఫికెట్ ఇప్పించవలెని కోరుచూ పై కేసు దాఖలు చేసియున్నారు. సదరు విషయం పై ఎవరికి ఎటువంటి అభ్యంతరాలు ఉన్నచో **తే: 01-07-2024దిని ఉదయం 10-30 గం.లకు** మీరు పై కోర్టులో హాజరై తెలువుకొనవలెను. లేనిచో మీ పరోక్షమందు పై కేసు తీర్మానించబడును.

ఎం.శ్రీనివాసరావు
అడ్వకేట్,
అనకాపల్లి.

IN THE HONOURABLE DISTRICT CONSUMER DISPUTES REDRESSAL COMMISSION AT VISAKHAPATNAM
C.C.NO. 468/2023

Between:
Smt. Ponnaganti Padmavathi and another . . . Petitioner / Complainants
And:
The Managing Director Kapil Chit (Kosta) Funds Pvt Ltd and others. . . . Respondent / Opposite Parties

PUBLIC NOTICE

To:
R-3: PONNAGANTI SILPHA W/o. Late Siva Nagaraju D.No. E105 Panchavati Township Akkireddypalem Visakhapatnam.
R-4: PONNAGANTI SASANVI D/o. Late Ponnaganti Shiva Nagaraju being minor represented by her mother P.Shilpa Door No E 105 Panchavati Township, Akkireddypalem Visakhapatnam.

Please take notice the above named petitioners field the above Consumer Case against the Opposite Parties 1 to 4 for recovery of the amount from 1 and 2 Opposite Parties for the recovery of Rs. 8,93,484/- (Eight Lakh Ninety Three Thousand Four Hundred Eighty Four). You are also entitled for half share. You were not receiving summons send through court. You are the Opposite parties 3 and 4 the Honourable court ordered notice by way of publication The above matter stands posted for hearing on **17-06-2024** for your appearance. You should attend the court on that day at **10-30 A.M.** failing which the matter will be decided in your absence.

S.SREE RAMAMUTHY
Advocate for Complainant
Visakhapatnam.

IN THE HONOURABLE COURT OF THE II ADDITIONAL SENIOR CIVIL JUDGE VISAKHAPATNAM
IP No. 27 OF 2023

Between:
Sri **Korada Anil Kumar**, aged 50 years, Hindu, S/o.Sri Korada Narayana Murthy, resident of Door No. 4-60-6/1, 2nd Floor, Lawson's Bay Colony, Visakhapatnam-530 017. ...Petitioner/Debtor

And:
Sri Kottakota Narayana Rao and 11 others....Respondents/Creditors

NOTICE

To
R-9:Sri Kothakota Vasudeva Rao, aged about 60 years, residing at Flat No. 102, Sri Vish Residency, Bhanu Nagar, H.B. Colony, Visakhapatnam-530 022.

Please take notice that the above named Petitioner has filed the above petition against you and 10 others and the same is stands posted to 27-06-2024 at 10:30 AM for your appearance, on that day you are personally or through Advocate attend before the Honourable Court at 10:30 AM failing which the matter will be heard and determined in your absence exparte as per law.

(By the order of the Honourable II Addl. Senior Civil Judge Court at Visakhapatnam)

Y.V. SUBBA REDDY, K.V. NAGAKUMARI,Advocates
D.No. 9-34-3, Pitapuram Colony, Visakhapatnam-530 003.
Cell : 94901 47601, 94901 47602

Visakhapatnam,
Date: 06-06-2024.

మహారాజశ్రీ నర్సీపట్నం సీనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

E.P.No. 46/2019 in O.S.No. 142/2017

DHR: పూసపాటి సీతారామచంద్రరాజు

JDR : రాజగోపాల రవికుమార్

వేలం ప్రకటన

ఈ నెంబరులో అమలు బాకీ రాబట్టుకొనే నిమిత్తం యందలి JDR తాలూకా యాక్రింద తెలిపిన స్థిరాస్తిని పై కోర్టులో బహిరంగవేలం తే:26-6-2024దిన ఉదయం 10-30 గంటల లగాయితూ వేలం వేయబడునని యిందుమూలంగా తెలియజేయడమైనది. కావున ఆసక్తి కలిగిన వేలంపాటదారులు పై కోర్టులో జరిగె బహిరంగ వేలంలో పాల్గొన వలసినదిగా కోరడమైనది.

షెడ్యూలు

అనకాపల్లి జిల్లా, నర్సీపట్నం సబ్-రిజిస్ట్రీ, గొలుగొండ మండలం, ఏజెన్సీ లక్ష్మీపురం పంచాయితీ మరియు గ్రామం, 6వ వార్డు, 5వ బ్లాక్ కంసాలిపేట, 2 పోర్షన్ల ఆర్‌సిసి స్లాబు యిల్లు సర్వేనెం. 49, అసిసెమెంట్‌నెం. 768 విస్తీర్ణం ఎ 0-03 సెంట్లు లేదా 119 చ॥ గ॥ గల యింటికి హద్దులు:

తూర్పు : చిటికెల అంజలి తాలూకా పెంకిటిల్లు
దక్షిణం: దిగుమర్తి పాపారావు తాలూకా యిల్లు
పడమర : పైల కృష్ణ, ఆకల సత్తెమ్మ తాలూకాయిళ్లు
ఉత్తరం: ప్రతివాది తాలూకా ఖాళీస్థలం మరియు చింతకాయల రాజు

DHR విలువ రూ. 4,00,000/-
అమీను విలువ : రూ. 10,00,000/-
JDR విలువ : ఇవ్వలేదు.

(జై కోర్టు ఆర్డర్)
పొక్కునూరి నాగేశ్వరరావు
న్యాయవాది,
పాతమున్సిపల్ ఆఫీసు వెనుక
నర్సీపట్నం-531116

నర్సీపట్నం
తే:6-6-2024

భీమిలిలో ఆధిక్యం ఇలా...

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి నియోజకవర్గంలో అసెంబ్లీ ఎన్నికల ఫలితాలను ఓ సారి పరిశీలిస్తే... టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ఈవీఎంల ద్వారా లక్షా 73 వేలా 467 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 2,763 ఓట్లు వచ్చాయి. వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు ఈవీఎంల ద్వారా 82,732 ఓట్లు, పోస్టల్ బ్యాలెట్ ద్వారా 1097 ఓట్లు లభించాయి. మొత్తంగా టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు లక్షా 76 వేలా 230 ఓట్లు, సమీప ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు 83 వేలా 829 ఓట్లు వచ్చాయి. ముత్తంశెట్టిపై గంటా 92,401 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.

అన్ని చోట్లా టిడిపికి ఆధిక్యత..

నియోజకవర్గంలో దాదాపు అన్ని మండలాలు, జివిఎంసి వార్డుల్లో సైతం టిడిపి అభ్యర్థి గంటా శ్రీనివాసరావుకు ఆధిక్యత లభించిందనే చెప్పాలి. పద్మనాభం మండలంలో మొత్తం పో లైన ఓట్లు 36,561 కాగా, టిడిపికి 20,937, వైసిపికి 12,586 ఓట్లు పోలయ్యాయి. టిడిపికి 8,351 ఆధిక్యత లభించింది. ఆనందపురం మండలంలో మొత్తం పోలైన ఓట్లు 45,325 కాగా టిడిపికి 26,638, వైసిపికి 15,415 ఓట్లు లభించాయి. టిడిపికి 11,223 ఓట్ల ఆధిక్యత లభించింది. భీమిలి మండలంలో మొత్తం పోలైన ఓట్లు 31,408 కాగా టిడిపికి 19,192, వైసిపికి 10,298 ఓట్లు వచ్చాయి. టిడిపికి 8,894 ఓట్ల ఆధిక్యత లభించింది.

జివిఎంసి వార్డుల్లో...

జివిఎంసి ఒకటో వార్డులో మొత్తం పోలైన ఓట్లు 11,450 కాగా టిడిపికి 7,294, వైసిపికి 3,380 ఓట్లు వచ్చాయి. టిడిపికి 3,914 ఓట్ల ఆధిక్యత లభించింది. రెండో వార్డులో 12,906 ఓట్లు పోలవ్వగా టిడిపికి 8,559, వైసిపికి 3,609 ఓట్లు వచ్చాయి. టిడిపికి 4,950 ఓట్ల ఆధిక్యత లభించింది. మూడో వార్డులో మొత్తం పోలైన ఓట్లు 10,387 కాగా, టిడిపికి 7,254, వైసిపికి 2,540 ఓట్లు వచ్చాయి. టిడిపికి 4,714 ఓట్ల ఆధిక్యత లభించింది. నాల్గో వార్డులో 14,314 ఓట్లు పోలవ్వగా టిడిపికి 9,507, వైసిపికి 3,796 ఓట్లు లభించాయి. టిడిపికి 5,711 ఓట్ల ఆధిక్యత లభించింది. 5వ వార్డులో మొత్తం పోలైన ఓట్లు 23,689 కాగా, టిడిపికి 14,341, వైసిపికి 7,606 ఓట్లు వచ్చాయి. టిడిపికి 6,735 ఓట్ల ఆధిక్యత లభించింది. 6వ వార్డులో మొత్తం పోలైన ఓట్లు 27,439 కాగా, టిడిపికి 17,667, వైసిపికి 7,477 ఓట్లు వచ్చాయి. టిడిపికి 10,190 ఓట్ల ఆధిక్యత లభించింది. 7వ వార్డులో మొత్తం పోలైన ఓట్లు 23,548 ఓట్లు కాగా, టిడిపికి 15,344, వైసిపికి 6,628 ఓట్లు వచ్చాయి. టిడిపికి 8,716 ఓట్ల ఆధిక్యత లభించింది. 8వ వార్డులో 15,842 పోలవ్వగా టిడిపికి 11,074, వైసిపికి 3,861 ఓట్లు లభించాయి. టిడిపికి 7,213 ఓట్ల ఆధిక్యత లభించింది. 14వ వార్డులో మొత్తం పో లైన ఓట్లు 700 కాగా టిడిపికి 501, వైసిపికి 130 వచ్చాయి. టిడిపికి 371 ఓట్ల ఆధిక్యత లభించింది. 15వ వార్డులో 2,358 ఓట్లు పోలవ్వగా టిడిపికి 1638, వైసిపికి 546 ఓట్లు వచ్చాయి. టిడిపికి 1092 ఓట్ల ఆధిక్యత లభించింది. 45వ వార్డులో మొత్తం పోలైన ఓట్లు 3,962 కాగా, టిడిపికి 2,596, వైసిపికి 1055 ఓట్లు రాగా, టిడిపికి 1541 ఓట్ల ఆధిక్యత లభించింది.

89వ వార్డులో 5,596 ఓట్లు పోలవ్వగా టిడిపికి 4,028 ఓట్లు, వైసిపికి 1198 ఓట్లు వచ్చాయి. టిడిపికి 2,830 ఓట్ల ఆధిక్యత లభించింది. 98వ వార్డులో మొత్తం పోలైన ఓట్లు 10,270కాగా టిడిపికి 6,897, వైసిపికి 2,607 ఓట్లు వచ్చాయి. టిడిపికి 4,290 ఓట్ల ఆధిక్యత లభించింది.



వైద్య సిబ్బందికి సూచనలిస్తున్న డాక్టర్ గంగునాయుడు

బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలి

ప్రజాశక్తి-ఆనందపురం : క్షయవ్యాధి రాకుండా పెద్దలంతా బీసీజీ వ్యాక్సిన్ వేయించుకోవాలని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి డాక్టర్ ఎం.గంగునాయుడు కోరారు. మండలంలోని గంభీరం హెల్త్ అండ్ వెల్నెస్ సెంటర్‌లో జరుగుతున్న బీసీజీ వాక్సినేషన్‌ను గురువారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. క్షయ వ్యాధి రాకుండా 60 సంవత్సరాలు పూర్తయిన వారికి, గత మూడేళ్లలో క్షయ వ్యాధి వచ్చిన వారి ఇంట్లో కుటుంబ సభ్యులకు, పొగ అలవాటు ఉన్నవారికి, బిఎంఐ 18 లోపు ఉన్నవారికి, సుగర్ వ్యాధి గ్రస్తులు, గత ఐదేళ్లలో టిబి వ్యాధి వచ్చి తగ్గినవారు బీసీజీ వ్యాక్సిన్ తప్పనిసరిగా వేయించుకోవాలని సూచించారు. గత నెల 16వ తేదీ నుంచి ప్రతి గురువారమూ ఈ వ్యాక్సిన్ వేస్తున్నట్లు ఆయన చెప్పారు. ప్రజలంతా వారికి దగ్గరలో ఉన్న ఎఎన్ఎం, ఎంఎల్‌హెచ్‌పిలను సంప్రదించాలని కోరారు. ప్రజల్లో అవగాహన తీసుకురావాలని ఆశ కార్యకర్తలకు ఆయన సూచించారు.

వృత్తి విద్యా కోర్సులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - ఆరిలోవ : విశాలాక్షినగర్‌లోని దయాల్‌బాగ్ విద్యా సంస్థలో ఉద్యోగ ఆధారిత వృత్తిపరమైన, ఆచరణాత్మక శిక్షణ, ఉద్యోగావకాశాల సహాయం కోసం దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు డిఇఐ ఇన్నొవేషన్ సెంటర్ నిర్వాహకులు ఒక ప్రకటనలో తెలిపారు. పదోతరగతి అర్హతగా మహిళలకు డ్రెస్ డిజైనింగ్ అండ్ టైలరింగ్, కటింగ్ అండ్ సూయింగ్, టెక్స్‌టైల్ డిజైనింగ్ అండ్ ప్రింటింగ్ (ఆడ,మగ), పురుషులకు మోటార్ వెహికల్ మెకానిజం, ఎలక్ట్రీషియన్, ఇంటర్ అర్హతతో స్త్రీలకు, పురుషులకు ఆఫీస్ అసిస్టెంట్, కంప్యూటర్ ఆపరేటర్, ఆఫీస్ మేనేజ్‌మెంట్, సెక్రటరీయేట్ ప్రాక్టీస్ కోర్సులకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులను ఆన్‌లైన్ ద్వారా www.dei.ac.in పంపించాలని పేర్కొన్నారు. మరిన్ని వివరాలకు 963340611 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

టిడిపి శ్రేణుల సంబరాలు

ప్రజాశక్తి -యంత్రాంగం

పద్మనాభం : మండలంలోని మద్ది గ్రామం నుంచి పద్మనాభం జంక్షన్ వరకు మండల తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యాన గురువారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. ముందుగా పద్మనాభం జంక్షన్‌లోని ఎన్‌టిఆర్ విగ్రహానికి మండల పార్టీ అధ్యక్షులు కె.నగేష్‌కుమార్ తదితరులు పూలమాల వేసి ర్యాలీని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండలంలోని పలు పంచాయతీల కార్యకర్తలు, నాయకులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

పిఎం.పాలెం గాయత్రినగర్‌లో కేక్ కట్ చేసి సంబరాలు చేసుకుంటున్న టిడిపి నాయకులు

పిఎం.పాలెంలో...

పిఎం.పాలెం : జివిఎంసి 6వ వార్డు పరిధి పిఎం పాలెం ఆర్‌హెచ్ కాలనీ, గాయత్రినగర్‌లో గురువారం టిడిపి శ్రేణులు సంబరాలు జరుపుకున్నాయి. ఈ సంబరాలకు ముఖ్య అతిథిలుగా జనసేన నాయకులు ఇఎన్ఎస్ చంద్రరావు, విశాఖ జిల్లా తెలుగు యువత ఉపాధ్యక్షులు, కెవిఆర్ క్యాటరింగ్స్ అధినేత గరే గురునాథ్ హాజరయ్యారు. బాణసంచా కాల్చారు. కేక్ కట్ చేసి మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. కార్యక్రమంలో టిడిపి వార్డు బిసి సెల్ అధ్యక్షులు రెడ్డి సత్యనారాయణ, కొరగంజి సూరిబాబు, రామకృష్ణ, బాబ్జీ, సంతోష్, రమణ, కరీం, వెంకటేష్, రమేష్, అనీల్, సునీల్, సలీం, పోతిన రమణ, పోతిన నాయుడు, స్థానిక నేతలు, కెవిఆర్ క్యాటరింగ్స్ సిబ్బంది పాల్గొన్నారు.

పాండ్రంగి ఆర్‌బికెలో మాట్లాడుతున్న మోహనరావు

పచ్చిరొట్ట ఎరువుల పంపిణీ

ప్రజాశక్తి -పద్మనాభం : మండలంలో రెండు రోజులుగా పచ్చిరొట్ట ఎరువులు, పిఎండిఎస్ స్కిట్స్ పంపిణీ చేస్తున్నారు. ప్రకృతి వ్యవసాయ ప్రాజెక్ట్ జిల్లా మేనేజర్ మోహనరావు ఆధ్వర్యాన కోరాడ, పాండ్రంగి ఆర్‌బికెలో పచ్చిరొట్ట ఎరువులు, పిఎండిఎస్ కిట్లను గురువారం మోహనరావు అందించారు. జీలుగ, జనుము విత్తనాలు పంపిణీచేశారు. వరి పంటకు ముందుగా పిఎండిఎస్ వెయ్యడం వల్ల ఎరువులు వాడకం తగ్గడంతో పాటు భూమి సారవంతమై అధిక దిగుబడులు సాధించవచ్చని మోహనరావు తెలిపారు. పాండ్రంగి ఆర్‌బికె విఎఎ రమాదేవి మాట్లాడుతూ, జీలుగ, జనుము, పిఎండిఎస్ కిట్లు కావాల్సిన రైతులు ఆర్‌బికెకు వచ్చి తీసుకెళ్లవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో పద్మనాభం మోడల్ మండల టీమ్ లీడర్ గణేష్, జిల్లా నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్లు అనురాధ, మాస్టర్ ట్రైనర్ సాగర్, జిల్లా హెచ్‌ఆర్ చక్రవర్తి, ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

స్మార్ట్ మానిటర్ శ్రేణిని ఆవిష్కరించిన శామ్‌సంగ్

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : సిరిపురంలోని శామ్‌సంగ్ కార్యాలయంలో తన 2024 శ్రేణి ఒడిస్సీ ఒఎల్ఇడి గేమింగ్ మానిటర్, స్మార్ట్ మానిటర్లు యువ్యూ ఫినిటీని మానిటర్‌లను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా సంస్థ ప్రతినిధి పునీత్ సేథ్ మీడియాతో మాట్లాడుతూ, వినియోగదారుల కోసం తదుపరి-స్థాయి అనుభవాలు కొత్త ఎఐ సామర్థ్యాలను అన్‌లాక్ చేసే ఫీచర్లతో ఆవిష్కరించినట్లు తెలిపారు. ఒడిస్సీ ఒఎల్ఇడిజి 6, స్మార్ట్ మానిటర్ శ్రేణి మెరుగైన వినోద ఫీచర్లతో మరింత సంతోషాన్ని అందిస్తాయని వివరించారు. ఎఐ వ్యూఫినిటీ శ్రేణి ద్వారా ఆధారితమైన స్మార్ట్ మానిటర్ ఎం8 పూర్తి వర్క్‌స్టేషన్‌ను సృష్టించగల కనెక్టివిటీని పెంచుతుందని తెలిపారు.

పలుచోట్ల పర్యావరణ దినోత్సవం

ప్రజాశక్తి -తగరపువలస : పర్యావరణ దినోత్సవం సందర్భంగా భీమిలి మండలం, చిప్పాడ దివీస్ ఆధ్వర్యాన పరిశ్రమ పరిసర ప్రాంతాల్లో గురువారం మన భూమి, మన భవిష్యత్తు నినాదంతో గ్రీన్ ర్యాలీ నిర్వహించి, మొక్కలు నాటారు. సంస్థ ఎమ్‌డి మురళీకృష్ణ దివి, డైరెక్టర్ ఎస్.దేవేందర్ రావు, జనరల్ మేనేజర్లు, అసిస్టెంట్ జనరల్ మేనేజర్లు, ఉద్యోగులు పాల్గొన్నారు.

మ్యాజిక్ బస్ సంస్థ ఆధ్వర్యాన సంతపేటలోని జివిఎంసి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రాథమిక పాఠశాల సమీపంలో పర్యావరణంపై స్థానికులకు అవగాహన కల్పిస్తూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం పద్మావతి, ఉపాధ్యాయులు ప్రసాద్, సంస్థ మోనటరింగ్ అధికారి దూడ రమేష్, సభ్యులు శారద, దుర్గ, రమ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణ ర్యాలీలో దివీస్ ఉద్యోగులు

మధ్యాహ్న భోజనం చేస్తున్న అనాథ పిల్లలు

అనాథ పిల్లలకు భోజనం

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని ఆర్.తాళ్లవలసలో ఉన్న అనాథ పిల్లల సంరక్షణ కేంద్రంలో గురువారం వైఎస్ఆర్‌సిపి అధ్యక్షులు కెఎస్ఎం.సుధాకర్ మధ్యాహ్న భోజనం ఏర్పాటుచేశారు. వైఎంసిఎ 180వ వార్షికోత్సవం సందర్భంగా ఈ తరహా కార్యక్రమం ఏర్పాటు చేసినందుకు సుధాకర్‌ను సంరక్షణ కేంద్రం నిర్వాహకులు వి.శ్రీనివాసరెడ్డి అభినందించారు. పిల్లలు హర్షం వ్యక్తం చేశారు.

పోస్టాఫీసుల్లో సమయపాలనేదీ?

తపాలా సేవలు అందక ప్రజల అవస్థలు

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని పలు పోస్టాఫీసుల్లో పోస్టుమాస్టార్లు, సిబ్బంది సమయపాలన పాటించడంలేదని పలు గ్రామాల ప్రజలు వాపోతున్నారు. సమయపాలన పాటించకపోవడంలో రెడ్డిపల్లి సబ్ పోస్టు కార్యాలయం సిబ్బంది ముందు వరసలో ఉంటారని చెబుతున్నారు. ప్రతి రోజూ ఉదయం 8 గంటలకు కార్యాలయం తెరిచి బ్రాంచి ఎస్‌పిఎం విధులు నిర్వహించాల్సి ఉంటుంది. రెడ్డిపల్లి పోస్టాఫీసు ఎస్‌పిఎం మాత్రం రోజూ 11 గంటలకు వచ్చి మధ్యాహ్నం 3 గంటలకు వెళ్లిపోతున్నారని ప్రజలు చెబుతున్నారు. పొట్నూరు గ్రామంలోని పోస్టాఫీసులో సిబ్బంది సమయం పాలన కూడా ఇలానే ఉందని ఆ గ్రామస్థులు చెబుతున్నారు. పొట్నూరు గ్రామంలో సుమారు 500 మంది పొదుపు ఖాతాదార్లు ఉన్నారు. వీరు పొదుపు చేసేందుకు పోస్టాఫీసుకు వెళ్తే సిబ్బంది సమయానికి రాక ఇబ్బందులు పడుతున్నట్లు వారంతా చెబుతున్నారు. కొత్తగా ఖాతాలు ప్రారంభించాలంటే సుమారు ఆరు నెలలు ఈ కార్యాలయం చుట్టూ తిరగాల్సి వస్తుందని ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. మండలానికి ప్రధాన పోస్టల్ కార్యాలయంగా ఉన్న రెడ్డిపల్లిలో పొదుపు ఖాతాలు ఇవ్వడం లేదని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన కోంత మంది ప్రజాశక్తికి చెప్పారు. రెడ్డిపల్లి పోస్టాఫీసు ఎస్‌పిఎం ప్రతి రోజూ బస్సు తప్పిపోయిందంటూ రోజూ ఏదో ఒక కుంటి సాకులు చెప్పుకొస్తున్నారని స్థానికులు తెలిపారు. ఈకార్యాలయంలో ఎటువంటి పని జరగాలన్నా ఆదికారిగా అయన ద్వారానే జరగాల్సి ఉందని తెలిపారు. రెడ్డిపల్లి పోస్టల్ కార్యాలయం పరిధిలో పద్మనాభం, ఆనందపురం మండలాలకు చెందిన గ్రామాలు ఉన్నాయి. సుమారు 40 గ్రామాలకు సేవలు అందించాల్సి ఉంటుంది. అటువంటి కార్యాలయాల్లో కూడా సిబ్బంది నిర్లక్ష్యంగా వస్తుంటే ఎలా అంటూ పలువురు ప్రశ్నిస్తున్నారు.

11 గంటలకు కూడా ఎస్‌పిఎం రాకపోవడంతో ఖాళీగా ఉన్న సీటు

ఎంఇఒలకు వినతిపత్రం అందిస్తున్న జిప్సా నాయకులు

ప్లే స్కూళ్లకు గుర్తింపు ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి -గాజువాక : ప్లే స్కూళ్లకు గుర్తింపు ఇవ్వాలని కోరుతూ జిప్సా నాయకులు గాజువాక, పెదగంట్యాడ మండల విద్యాశాఖాధికారులు ఎం.సునీత, విశ్వనాథం, శ్రీనివాస్, రమణీజీలకు గురువారం వినతిపత్రం అందజేశారు. 1 నుంచి 10వ తరగతి మాదిరిగా నర్సరీ, ఎల్‌కెజి, యుకెజి తరగతుల నిర్వహణ కోసం ప్రభుత్వ గుర్తింపు మంజూరు చేయించాలని కోరారు. ఎటువంటి అనుమతులు లేకుండా యథేచ్ఛగా నిర్వహించుకుంటున్న వందలాది ప్లే స్కూళ్లపై చర్యలు తీసుకోవాలని కోరారు. ప్లే స్కూళ్ల ముసుగులో 1, 2, 3 తరగతులు కూడా నిర్వహిస్తున్నారని, సిటీ పరిధిలో పుట్టగొడుగుల్లా వీధి కొకటి వెలసిపోతున్న ప్లే స్కూళ్లను పరిశీలించి తగు చర్యలు తీసుకోవాలని సంఘ సభ్యులు కోరారు. దీనిపై ఎంఇఒలు సానుకూలంగా స్పందించారు. వినతిపత్రం అందించిన వారిలో జిప్సా అధ్యక్షుడు పి.భాస్కరరావు, కార్యదర్శి బి.శ్రీనివాస్, కోశాధికారి డి.శ్రీనివాస్, సభ్యులు సత్యనారాయణ, బాబూరావు, విజయ్ తదితరులున్నారు.

యథేచ్ఛగా స్క్రాప్ దుకాణాలు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక నియోజవర్గ పరిధిలో ఎలాంటి అనుమతులు తీసుకోకుండా ప్రతి జంక్షన్‌లోనూ యథేచ్ఛగా స్క్రాప్ దుకాణాలు ఏర్పాటుచేస్తున్నారు. గతంలో నగర పోలీస్ కమిషనర్ ఈ దుకాణాలను మూసివేయాలని ఆదేశాలు జారీ చేసినప్పుడు, ఏడాది వరకు మూసివేశారు. ఈ మధ్యకాలంలో క్రమేపీ విస్తరిస్తున్నాయి. జగ్గు సెంటరు, అదాని గంగవరం పోర్టు రోడ్డు, బీసీ రోడ్డు, షీలానగర్, పెదగంట్యాడ స్టీల్‌ప్లాంట్‌కు వెళ్లే రహదారులు, వికాస్‌నగర్ లోనూ ఎక్కడపడితే అక్కడ పుట్టగొడుగుల్లా స్క్రాప్ దుకాణాలు ఏర్పాటు చేశారు. ఇళ్లల్లోనే పాడైపోయిన పాత ఇనుప సామాన్లు కొనుగోలు చేస్తే ఎవరికి ఎలాంటి సమస్యా లేదు. స్క్రాప్ దుకాణంలో పనిచేసే సిబ్బంది రాత్రి సమయాల్లో విశాఖ స్టీల్‌ప్లాంట్, హెచ్‌పిసిఎల్, నేవల్ డాక్‌యార్డ్ లాంటి పరిశ్రమల్లో చోరీకి పాల్పడి, ప్రభుత్వ ఆస్తిని కొల్లగొడుతున్నారు. సెక్యూరిటీని తప్పించుకొని, విలువైన ఇనుప ఖనిజాన్ని దొంగతనం చేసి అమ్ముకాలు చేస్తున్నారు. కొండవాలు ప్రాంతాల్లో నివాసముంటున్న ప్రజలు ద్విచక్ర వాహనాలను కింద రోడ్డుపై ఉంచేస్తుంటారు. అలాంటి వాహనాల బ్యాటరీలను చోరీ చేస్తున్నారు. ఎక్కువగా దశమికొండ, అప్పన్నకాలనీ, శ్రీనగర్ ప్రాంతాల్లో ఈ కేసులు నమోదయ్యాయి. అదాని గంగవరం పోర్టు రోడ్డులో కాపుకాసి పోర్టు నుంచి వచ్చే ట్రాలర్ల పైకి రాత్రి సమయంలో ఎక్కి స్టీల్ యాంగిల్స్‌ను చోరీ చేస్తున్నారు. ఇప్పటికైనా స్క్రాపు దుకాణాలపై స్థానిక పోలీసు అధికారులు దృష్టి పెట్టాలని స్థానికులు కోరుతున్నారు. దీనిపై సౌత్ ఏసిపి త్రినాధను వివరణ కోరగా, తమ పరిధిలో ఉన్న స్క్రాప్ దుకాణాలను మూసివేశామని, ఒకవేళ ఎక్కడైనా కనిపిస్తే చర్యలు తీసుకుంటామని తెలిపారు.

స్క్రాప్ దుకాణాలు

నెలరోజుల్లో టోల్ ప్లాజా ఎత్తివేతకు చర్యలు

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుతా : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

కేక్‌ను కట్ చేస్తున్న అభిమానులు

ప్రజాశక్తి -గాజువాక : నెల రోజుల్లో అగనంపూడి టోల్‌గేటును ఎత్తివేసేందుకు చర్యలు చేపడతానని, విశాఖ స్టీల్‌ప్లాంట్‌ను ప్రయివేటు పరం కాకుండా కాపాడతానని గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు చెప్పారు. సార్వత్రిక ఎన్నికల్లో విజయం సాధించిన తర్వాత గాజువాక టిడిపి కార్యాలయంలో గురువారం అభిమానులు భారీ ఎత్తున సంబరాలు జరుపుకున్నారు. కేకును కట్ చేసి పంచిపెట్టారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మీడియాతో మాట్లాడుతూ, ఇది ప్రజా విజయమన్నారు. ఇంతటి ఘన విజయాన్ని చేకూర్చిన నియోజకవర్గ ప్రజలకు, కూటమి శ్రేణులకు కృతజ్ఞతలు తెలిపారు. ఎన్నికల ప్రచారంలో తాను ఏవైతే హామీలిచ్చానో వాటన్నింటినీ అమలు చేసేందుకు కృషి చేస్తానన్నారు. ప్రజాస్వామ్యంలో గెలుపోటములు సహజమని, అయినప్పటికీ ఇష్టానుసారంగా వ్యాఖ్యలు చేస్తే పరిస్థితులు ఎలా ఉంటాయో ఈ ఎన్నికలు రుజువు చేశాయని పేర్కొన్నారు. మంత్రి పదవిని ఆశిస్తున్నారా అన్న మీడియా ప్రశ్నకు ఆయన బదులిస్తూ పదవి కావాలని తనకున్నప్పటికీ అధిష్టానం నిర్ణయమే శిరోధార్యమన్నారు. తన వెన్నంటే ఉంటూ విజయానికి సహకరించిన అందరికీ ధన్యవాదాలు తెలిపారు. ఇంతటి మెజారిటీ రావటంపై అధినేత చంద్రబాబు కూడా అభినందించారని చెప్పారు. గాజువాక ఖ్యాతి దేశానికి తెలిసేలా తనకు మెజారిటీనిచ్చిన ప్రజల రుణం తీర్చుకుంటానన్నారు. జనసేన పిఎసి సభ్యుడు కోన తాతారావు, బిజెపి కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు, జివిఎంసి టిడిపి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. గాజువాక వర్తక సంఘం నాయకులు కూడా పాల్గొని శు భాకాంక్షలు తెలిపారు.

స్టార్మ్ సిరీస్‌లో న్యూ గ్లోస్టర్ విడుదల

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : బ్రిటీష్ ఆటోమొబైల్ బ్రాండ్ ఎంజీ (మోరిస్ గరాజ్స్), డిజర్ట్ స్టార్మ్, స్నోస్టార్మ్ సిరీస్‌లో కొత్త ఎంజీ గ్లోస్టర్‌ను విశాఖ మార్కెట్‌లో విడుదల చేసింది. ఈ కొత్త ఎంజీ గ్లోస్టర్ స్టార్మ్ సిరీస్ సూక్ష్మంగా రూపొందించి, విలాసవంతమైన బోల్డ్ రూపం కలిగి ఉందని ఎంజీ మోటార్ ఇండియా చీఫ్ కమర్షియల్ ఆఫీసర్ సతీందర్ సింగ్ బజ్వా తెలిపారు. గురువారం ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కొత్త ఎంజీ గ్లోస్టర్ డిజర్ట్ స్టార్మ్ డీప్ గోల్డెన్ ఎక్స్‌టీరియర్‌తో వెళ్లిన ప్రతి చోట ఖచ్చితంగా ఆకట్టుకునే డ్యూయల్-టోన్ పెరల్ వైట్, బ్లాక్ ఎక్స్‌టీరియర్‌లో స్నోస్టార్మ్ లభిస్తోందని తెలిపారు. ఎంజీ గ్లోస్టర్ రేంజ్ ఆకర్షణీయమైన రూ.38.80 లక్షల (ఎక్స్-షోరూం) ధరకు లభిస్తోందని పేర్కొన్నారు. భద్రతా పరంగా ఫార్వర్డ్ కొలిషన్ వార్నింగ్ (ఎఫ్ సీడబ్ల్యూ), ఆటోమేటిక్ ఎమర్జన్సీ బ్రేకింగ్ (ఏఈబీ), లేన్ డిపార్చర్ వార్నింగ్ (ఎల్ డీడబ్ల్యూ), బ్లైంట్ స్పాట్ డిటెక్షన్, లేన్ ఛేంజ్ అసిస్ట్‌తో ఏడీఏఎస్ (ఎల్2) తదితర 30 భద్రతా ఫీచర్స్‌తో లభిస్తోందని వివరించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-వేపగుంట, పద్మనాభం : సత్తివానిపాలెం 11 కెవి ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల నిమిత్తం శుక్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు జోన్-3 ఇఇ పోలాకి శ్రీనివాసరావు తెలిపారు. ఫీడర్ పరిధిలోని సీతారామగార్డెన్స్, తులసి గార్డెన్స్, గ్యాస్ గొడౌన్ ఏరియా తదితర ప్రాంతాలకు విద్యుత్ సరఫరా ఉండదని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

పద్మనాభం : పద్మనాభం, రేవిడి ఫీడర్ల నిర్వహణ, లైన్ మరమ్మత్తుల నిమిత్తం శు క్రవారం పలు ప్రాంతాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఇఇ పి.శ్రీనివాసరావు తెలిపారు. రేవిడి, బర్లపేట, పాండ్రంగి, కొండ బర్లపేట, కూరపల్లి, పాండ్రంగి, పద్మనాభం తదితర ప్రాంతాలకు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

అందరికీ అందుబాటులో ఉంటా

పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న పంచకర్ల రమేష్‌బాబు

ప్రజాశక్తి-పెందుర్తి : గెలుపు వల్ల తన బాధ్యత మరింత పెరిగిందని, ప్రజలకు 24 గంటలూ అందుబాటులో ఉంటానని పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు చెప్పారు. 95వ వార్డు పరిధిలోని ఒక ప్రయివేటు కల్యాణ మండపంలో గురువారం ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. పెందుర్తిలో ఎమ్మెల్యే అభ్యర్థిని గెలిపించడంతో పాటు ఎంపీ అభ్యర్థిని కూడా గెలిపించే బాధ్యత తాను తీసుకుంటానని ఆ రోజే చెప్పానని, దానికి తగ్గట్టుగా పెందుర్తి ప్రజలు కూడా తనను ఆదరించారని చెప్పారు. ప్రజలు ఎప్పుడు ఫోన్ చేసినా తానే లిఫ్ట్ చేస్తానని, తనకు పిఎలు కూడా ఉండరని తెలిపారు. పంచ గ్రామాల భూ సమస్య, తాడి గ్రామం తరలింపు వంటి ప్రధాన సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో 96వ వార్డు కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు, టిడిపి నాయకులు శానాపతి శంకరరావు, జనసేన 97వ వార్డు అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, జనసేన టిడిపి బిజెపి నాయకులు పాల్గొన్నారు.

కార్యకర్తలకు, ప్రజలకు

అనుసంధానం లేకపోవడంతోనే ఓటమి

- జగన్మోహన్‌రెడ్డిని తప్పుదోవపట్టించిన కోటరీ
- మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

ప్రజాశక్తి-చోడవరం

కార్యకర్తలకు, ప్రజలకు మధ్య అనుసంధానం లేకపోవడమే వల్లే వైసీపీ ఓటమి చెందిందని చోడవరం మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ అన్నారు. చోడవరం గురువారం ఆయన స్థానిక విలేకర్లతో మాట్లాడుతూ వాలంటీర్లు, ఐ ప్యాక్ టీమ్ సంక్షేమ పథకాలు ప్రజలకు అందుబాటులో తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషించడంతో ప్రజా ప్రతినిధులకు, కార్యకర్తలకు ప్రజలతో సంబంధాలు తెగిపోయాయని పేర్కొన్నారు. దీంతో ప్రభుత్వ పథకాలు ఎవరైనా ఇస్తారన్న ధీమాతో ప్రజలు ఉండటంతో పార్టీకి ప్రజలకు సంబంధం లేకుండా పోయిందన్నారు. ఈ కారణంగా ప్రజలు బాగుపడి పార్టీ నష్టపోయిందన్నారు. పార్టీకి కింద స్థాయి పనిచేసే యంత్రాంగం పూర్తిగా నిరుత్సాహానికి గురై 2019 ఎన్నికల్లో పార్టీ కార్యకర్తలు చూపించిన ఉత్సాహం 2024 ఎన్నికల్లో లేదని పేర్కొన్నారు. ముఖ్యమంత్రికి ఎమ్మెల్యేలకు మధ్య ఉండే కోటరీ జగన్మోహన్ రెడ్డిని తప్పుతవ పట్టించారన్నారు. కింద స్థాయిలో జరుగుతున్న విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లపోవడం, వాటిని తీసుకువెళదామన్న తమలాంటి వారికి అవకాశం ఇవ్వకపోవడంతో పార్టీ ఓటమికి గురైందని ధర్మశ్రీ తెలిపారు. చోడవరం నియోజకవర్గంలో తమ పార్టీకి ఓటు వేసిన ప్రతి ఒక ఓటర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్తులో ప్రజలకు అండగా ఉండి పనిచేస్తామన్నారు. ఈ సమావేశంలో డీసీఎంఎస్ చైర్మన్ నర్సింగరావు, ఎంపీపీ గాడి కాసు, జడ్పిటిసి దొండ రాంబాబు, మాజీ జెడ్పిటిసి బొడ్డేటి సూర్యనారాయణ, సర్పంచులు మూడెడ్ల శంకర్రావు, మండల వైసీపీ అధ్యక్షుడు దొడ్డి వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

పంచకర్ల రమేష్‌బాబుకు పుష్పగుచ్ఛం ఇస్తున్న నాయకులు

పంచకర్లను కలిసిన కూటమి నేతలు

ప్రజాశక్తి - పరవాడ

పెందుర్తి శాసన సభ్యునిగా విజయం సాధించిన పంచకర్ల రమేష్‌బాబును మండలంలోని ఈదులపాక బోనంగి గ్రామపంచాయతీకి చెందిన జనసేన, టీడీపీ, బీజేపీ శ్రేణులు గురువారం మర్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేసారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ పరవాడ మండలం అధ్యక్షులు, ఈ.బోనంగి సర్పంచ్ బొద్దపు శ్రీనివాస్ కాసులు, మాజీ ఉప సర్పంచ్ బుగిడి రామగోవిందరావు, ఉప సర్పంచ్ మేడిశెట్టి వెంకటరమణ, మాజీ ఉప సర్పంచ్ బొద్దపు అర్జున్ నరసింగరావు, బొండా తారక రమేష్ కుమార్, మేడిశెట్టి యుగందర్, రాయి నీలాబాబు, బొద్దపు చిన్నశ్రీను పాల్గొన్నారు.

ఉషను అభినందిస్తున్న హెచ్ఎం, ఉపాధ్యాయులు

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఉష ఎంపిక

ప్రజాశక్తి-దేవరాపల్లి

మండలంలోని ఏ కొత్తపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన టి.ఉష ఎన్ఎంఎంఎస్ స్కాలర్షిప్‌కు ఎంపికైంది. ఈ మేరకు ఉషను గురువారం పాఠశాలలో అభినంచారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు వై. స్వర్ణలత మాట్లాడుతూ ఎంపికైన విద్యార్థికి 9వ తరగతి నుండి 12వ తరగతి వరకు నాలుగు సంవత్సరాలలో సంవత్సరానికి రూ.15 వేల చొప్పున స్కాలర్షిప్ లభిస్తుందని తెలిపారు. ప్రతి సంవత్సరం తమ పాఠశాల నుంచి ఒక విద్యార్థి ఈ స్కాలర్షిప్‌కి ఎంపికవుతున్నట్లు చెప్పారు. పాఠశాలలో ఎన్‌సిసి, స్కౌట్ అండ్ గైడ్స్, స్టెమ్ ల్యాబ్, క్రీడలలో ప్రోత్సాహం, యోగ మెడిటేషన్, వెనుకబడిన విద్యార్థులపై శ్రద్ధ వహించి ప్రత్యేక తరగతులు నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. పాఠశాల రోల్ పెంచడానికి విద్యార్థులు ఉపాధ్యాయులతో కలిసి బ్యానర్‌తో అడ్మిషన్ క్యాంపెయిన్ నిర్వహించారు. స్కాలర్షిప్ ఎంపికైన విద్యార్థిని ఉషను గ్రామ సర్పంచ్ చింతల సత్య వెంకటరమణ, వైస్ ఎంపీపీ చింతల బుల్లి లక్ష్మి అభినందించారు. ఈ కార్యక్రమంలో పెద్దాడ వెంకటరమణ, రొంగలి శివ ప్రసాద్, పాఠశాల ఉపాధ్యాయ సిబ్బంది పాల్గొన్నారు.

ట్రైనీ డిఎస్‌పి భవ్య రెడ్డికి అభినందనలు

భవ్యరెడ్డికి జ్ఞాపిక ఇస్తున్న ఎస్‌పి మురళీకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

ట్రైనీ డిఎస్‌పి భవ్యరెడ్డిని జిల్లా ఎస్‌పి కెవి.మురళీకృష్ణ గురువారం అభినందించారు. 2022 సంవత్సరంలో ఏపీపీఎస్ పరీక్షల్లో ఉత్తీర్ణులై డీఎస్పీగా భవ్య రెడ్డి ఎంపికై పిటిసి అనంతపూర్‌లో శిక్షణ పొంది, ఫీల్డ్‌లో శిక్షణ పొందేందుకు అనకాపల్లి జిల్లాకు కేటాయించబడ్డారు. అనకాపల్లి రూరల్ పోలీస్ స్టేషన్, ఎలమంచిలి పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ నుండి ఎస్‌హెచ్‌ఒ, సీఐ, అనకాపల్లి డిఎస్‌పి చేసే విధులలో శిక్షణ పొందారు. ఎన్ఫోర్స్మెంట్ కేసులు, 2024 సార్వత్రిక ఎన్నికల సమయంలో బందోబస్తు విధులు అంకితభావం, నిబద్ధతతో సమర్థవంతంగా ఏ విధంగా నిర్వహించాలో శిక్షణ పొందారు. అనకాపల్లి, పరవాడ సబ్ డివిజన్ అధికారుల మార్గనిర్దేశంలో జిల్లా ఎస్పీ మురళీకృష్ణ, అదనపు ఎస్పీ బి. విజయభాస్కర్ సూచనలు సలహాలతో కేసుల దర్యాప్తులో ప్రావీణ్యం సాధించారు. జిల్లాలో లా అండ్ ఆర్డర్‌లో శిక్షణ పూర్తి చేసుకొని గ్రే హౌండ్స్‌లో శిక్షణ పొందేందుకు వెళ్తున్న సందర్భంగా జిల్లా ఎస్పీ మురళీకృష్ణ అభినందించి సత్కరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ బి.విజయభాస్కర్, ఇతర అధికారులు ట్రైనీ డీఎస్పీని అభినందించారు.

గిరిజన గ్రామాల్లో ఫీవర్ సర్వే

ప్రజాశక్తి-దేవరాపల్లి : మండలంలోని చింతలపూడి సచివాలయం పరిధిలోని మారుమూల గిరిజన గ్రామాల్లో ఫీవర్ సర్వే లైన్స్ కార్యక్రమం గురువారం నిర్వహించారు. దేవరాపల్లి ప్రభుత్వ ఆరోగ్య కేంద్రం వైద్యాధికారిణి పూజ్య మేఘన ఆదేశాల మేరకు చింతలపూడి సచివాలయం హెల్త్ అసిస్టెంట్ చెల్లిబోయిన కృష్ణ గిరిజనులకు రక్తపూత నమూనా పరీక్షలు నిర్వహించారు. చింతలపూడి సచివాలయం పరిధిలోని బోడిగరువు, నేరెళ్లపూడి, బొడ్డు గూడ గ్రామాల్లో 25 మందికి రక్తపూత పరీక్షలు జరపగా అందులో ఏడుగురికి మలేరియా ఆర్‌డిటిలు నెగిటివ్ వచ్చాయని హెల్త్ అసిస్టెంట్ కృష్ణ తెలిపారు. ఆయా గ్రామాలకు ద్విచక్ర వాహనం కూడా వెళ్ళని పరిస్థితిలో వాగు వంకలు దాటి హెల్త్ అసిస్టెంట్ కృష్ణ వైద్య పరీక్షలు నిర్వహించారు. ఆయన సేవలను పలువురు అభినందించారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్‌షిప్‌కు ఎంపికైన విద్యార్థులు

బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌కు ఎంపికైన విద్యార్థులు తమ బ్యాంకు అకౌంట్‌కు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని జిల్లా విద్యాధికారి ఎం వెంకట లక్ష్మమ్మ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 2019 నుంచి 2022 వరకు ఈ స్కాలర్షిప్ పరీక్షల్లో ఎంపికై తొమ్మిది నుంచి 12వ తరగతి చదువుతున్న నేషనల్ స్కాలర్షిప్ పోర్టల్‌లో నమోదు, రెన్యువల్ చేసుకొని ఇంకా స్కాలర్షిప్ జమ కాని విద్యార్థి మొబైల్ నెంబర్‌కు మెసేజ్ పొందిన ప్రతి విద్యార్థి తమ బ్యాంకు ఎకౌంటుకు ఆధార్ సీడింగ్ చేసుకోవాలని సూచించారు. విద్యార్థి మెరిట్ కార్డు, ఆధార్ కార్డు, బ్యాంకు పాసుబుక్ విద్యార్థి లాగిన్‌లోని ప్రింట్ తీసుకొని బ్యాంకు అధికారులను సంప్రదించాలన్నారు. పోర్టల్‌కు సంబంధించిన సమస్యల కొరకు హెల్ప్ డెస్క్ helpdesk@nsp.gov.in లో నేరుగా సంప్రదించాలన్నారు.

అప్పన్నను దర్శించుకున్న బండారు

ప్రజాశక్తి- సబ్బవరం

అసెంబ్లీ ఎన్నికల్లో మాడుగుల నియోజకవర్గం నుంచి విజయం సాధించిన మాజీ మంత్రి బండారు సత్యనారాయణమూర్తి బుధవారం సాయంత్రం సింహాచలం లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకున్నారు. అలాగే సబ్బవరం మండలంలో పాత రోడ్డు శ్రీపరదేశమంబ అమ్మవారిని, సబ్బవరం శ్రీదర్గమాంబ అమ్మవారిని, పైడివాడ అగ్రహారం శ్రీకనకదుర్గ అమ్మవారిని సతీసమేతంగా దర్శించుకుని పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయనకు సబ్బవరం మండల టిడిపి నేతలు ఘనంగా స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మిడతాడ మహాలక్ష్మి నాయుడు, నాయకులు గండి ముత్యాల నాయుడు, గండి దేముడు, కోటాన అప్పారావు, బుచ్చిరాజు, దొడ్డి సూర్య ప్రకాష్, రేసుపూడి రమణ, గవర అప్పారావు, గవర సత్యనారాయణ, అక్కిరెడ్డి దుర్గి నాయుడు, బొబ్బరి కన్నారావు, శీరం అప్పలరాజు, గొంతిన పైడిరాజు, శరగడం శంకర్రావు, ఆడారి నాగరాజు, పెద్దాడ రమణమ్మ, పలువురు సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

బండారుకు వియ్యపు చిన్న శుభాకాంక్షలు

పరవాడ : మాడుగుల నియోజకవర్గం శాసన సభ్యులుగా విజయం సాధించిన బండారు సత్యనారాయణ మూర్తికి టిడిపి పరవాడ మండల అధ్యక్షులు వియ్యపు చిన్నా గురువారం బొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సారిపల్లి జోగినాయుడు, పాతర పల్లి రమణ, మొల్లి బాలాజీ, షేక్ మదీనా, తెలుగు చలపతిరావు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న బండారు దంపతులు

రోడ్డుపై గోతుల్లో వర్షం నీరు

ఇబ్బంది పడుతున్న ప్రయాణికులు

ప్రజాశక్తి -బుచ్చెయ్యపేట

మండలంలోని బియన్ రోడ్లో బంగారమెట్ట నుండి రావికమతం వరకు గల రోడ్డులో పెద్దపెద్ద గొయ్యిల్లో వర్షపు నీరు భారీగా చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు బంగారు మెట్ట కూడలి, పొట్టిదొరపాలెం, బుదిరెడ్డపాలెం గ్రామాల సమీపంలో కూడా వర్షపునీరు గోతుల్లో చేరింది. ఈ రోడ్డు పై ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ రోడ్డు మరమ్మతులు చేపట్టాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బంగారుమెట్ట కూడలి వద్ద రోడ్డుపై గోతుల్లో చేరిన వర్షం నీరు

వర్షాల నేపథ్యంలో ముందస్తు చర్యలు

ప్రజాశక్తి - యలమంచిలి

రానున్న రోజుల్లో నైరుతి పవనాల మూలంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందన్న అందుకు అనుగుణంగా గ్రామాల్లో ముందస్తు చర్యలు చేపట్టాలని యలమంచిలి ఎంపిడిఒ కె.అప్పలనాయుడు ఆదేశించారు. మండల పరిషత్తు కార్యాలయంలో గురువారం జరిగిన మండలంలోని గ్రామకార్యదర్శుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వర్షాలకు మంచినీరు కలుషితమౌతుందని, పారిశుధ్యం లోపిస్తుందని, లోతట్టు ప్రాంతాల్లో మురుగునీరు చేరి ప్రజలకు అంటు వ్యాధులు ప్రబలే పరిస్థితి ఉంటుందని, వీటన్నింటిని ఎదుర్కొనే చర్యలు వెంటే చేపట్టాలని కోరారు. ముందస్తుగా క్లోరిన్ నిల్వలు ఉండేలా చూసుకోవాలన్నారు. విద్యుత్ అంతరాయం జరిగే చోట్ల ముందుగానే ఓవర్ హెడ్ ట్యాంకుల్లో మంచినీరు ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎక్కడా చెత్త నిల్వలు పేరుకుపోకుండా పారిశుధ్య పనులు చేపట్టాలని సూచించారు. వర్షాలు కురిసే సమయంలో పిడుగులు పడే ప్రమాదాలున్న ప్రాంతాల్లో ముందస్తు హెచ్చరికలు జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో మండల పరిషత్తు కార్యాలయ సూపరింటెండెంట్ ప్రసాదరావు, ఇఒపిఆర్‌డి, 17 పంచాయతీల కార్యదర్శులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎంపిడిఒ అప్పలనాయుడు

ప్రతిష్టాత్మక ప్రాంతాల్లో ప్రాభవం కోల్పోయిన వైసిపి

కన్నబాబురాజు ముఖ్య అనుచరుల ఏరియాల్లోనూ జనసేనకు ఆధిక్యత

ప్రజాశక్తి - యలమంచిలి : యలమంచిలి నియోజకవర్గం వైసిపి అభ్యర్థి యువి.రమణమూర్తిరాజు (కన్నబాబురాజు)ను పోల్ మేనేజ్‌మెంట్ తెలిసిన నాయకుడిగా అందరూ భావిస్తారు. తను పోటీ చేసిన ఎన్నికల్లో ఎక్కడ ఎంత మెజార్టీ వస్తుందో లెక్కగట్టి మరీ చెప్పడం ఆయన రివాజు. అయితే ఆయన అంచనాలు 2024 ఎన్నికల్లో తారుమారయ్యాయి. గట్టి ఎదురుదెబ్బే తగిలింది. కలలో కూడా ఊహించని వ్యతిరేకత వైసీపీ ప్రభుత్వంపైనా, కన్నబాబురాజు ప్రాతినిధ్యంపైనా కనిపించింది. వెరసి ఘోర పరాజయం పాలయ్యారు. ఓట్ల లెక్కింపు సమయం మధ్యలోనే కౌంటింగ్ స్థలాన్ని వీడి వెళ్లిపోయారంటే ఎంతటి అవమానకర పరిస్థితి ఏర్పడిందో అర్థం చేసుకోవచ్చు.

ప్రతిష్టాత్మక ప్రాంతాల్లో ప్రాభవం కోల్పోయిన వైసిపి

యలమంచిలి మండలంలోని కొన్ని ప్రతిష్టాత్మక ప్రాంతాల్లో వైసిపి తన ప్రాభవాన్ని కోల్పోయింది. కన్నబాబురాజు ద్వితీయ శ్రేణి నాయకుల ప్రాంతాల్లో వైసిపి ఓట్ల పతనం స్పష్టంగా కనిపిస్తుంది. మండలంలో ఏకైక మేజర్ పంచాయతీ ఏటికొప్పాకలోని ఏడు పోలింగ్ బూత్‌లలో మొత్తం పోలైన ఓట్లు 3,983 కాగా, అందులో జనసేన 2,519 ఓట్లు సాధించి 1,055 ఓట్లు మెజార్టీ దక్కించుకుంది. కన్నబాబురాజు ముఖ్య అనుచరుడిగా సోమలింగపాలెంలో అనేక అభివృద్ధి పనులు చేయించిన కర్రి శివ నాయకత్వం వీగిపోయింది. ఇక్కడ 1,944 ఓట్లు పోలవగా జనసేన 1,058 ఓట్లు సాధించి 172 ఓట్లు ఆధిక్యత ప్రదర్శించింది. మరో ముఖ్య అనుచరుడైన ఎంపిపి బోదెపు గోవిందరావు స్వగ్రామం తురంగలపాలెంలో 452 ఓట్లు పోలవగా గ్లాసుగుర్తు 265 సాధించి 78 ఓట్ల ఆధిక్యత సాధించింది. ఆడారి తులసీరావు కుటుంబం ప్రాతినిధ్యం వహించే తులసీనగర్‌లో మున్సిపల్ చైర్‌పర్సన్ రమాకుమారి వైసిపి తరుపున ప్రచారం సాగించినా అక్కిడి నాలుగు బూత్‌లలో (42 నుంచి 48) మొత్తం 2,312 ఓట్లు పోలవగా గ్లాసు గుర్తు 1,712 ఓట్లు సాధించి 1,111 ఓట్లు ఆధిక్యత పొందింది. ఇక వైసీపీ నేతలు కొలువున్న పెదపల్లి విషయానికొస్తే నాలుగు పోలింగ్ బూత్‌ల్లో మొత్తం 2,841 ఓట్లు పోలవగా అందులో జనసేన 1,611 ఓట్లు సాధించి 381 ఓట్ల మెజార్టీతో నాయకుల్ని వెక్కిరించింది. ఇలా అన్ని పోలింగ్ బూత్‌ల్లోనూ వైసిపికి చుక్క ఎదురైంది. యలమంచిలి మండలం మొత్తం పరిశీలిస్తే వైసిపి కంటే జనసేనకు 11,869 మెజార్టీ ఓట్లు లభించాయి. ఇదొక చరిత్ర. ఇంత భారీ మెజార్టీ గతంలో ఏ ఎమ్మెల్యేకు రాలేదు.

నిర్మానుష్యంగా ఉన్న యలమంచిలి వైసిపి కార్యాలయం

నిరంకుశ పాలనపై ప్రజాగ్రహం

ప్రజాశక్తి-పరవాడ : సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలిచ్చిన తీర్పును స్వాగతిస్తున్నమని, రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై వేసిన భారాలు, విచ్చలవిడి అవినీతి, అరాచక పాలన, నిరంకుశ విధానాల పట్ల ప్రజాగ్రహం వ్యక్తమైందని సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు గనిశెట్టి సత్యనారాయణ పేర్కొన్నారు. రాష్ట్రంలో బిజెపి పోటీ చేసిన ఆరు పార్లమెంటు స్థానాల్లో మూడు స్థానాల్లో ఓడించడం రాష్ట్రానికి కేంద్రం చేసిన ద్రోహానికి ప్రజల స్పందన అని తెలిపారు. రాష్ట్రంలో ఇండియా బ్లాకు పార్టీలకు ఓటు వేసిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. పెందుర్తి నియోజకవర్గంలో ప్రధాన సమస్యల పరిష్కారానికి అధికారంలోకి వచ్చిన తెలుగుదేశం, జనసేన, పార్టీలు కృషి చేయాలన్నారు. తాడి గ్రామం తరలించడానికి, పంచ గ్రామాల సమస్య పరిష్కారానికి, మూల స్వయంవరం, స్వామి నాయుడుపాలెం గ్రామాలు తరలించడానికి చర్యలు తీసుకోవాలని కోరారు. ఫార్మా, ఎన్టీపిసి కాలుష్యం, బొగ్గు బూడిది, లారీల సమస్య, రోడ్ల నిర్మాణం, ఉపాధి కల్పన, ల్యాండ్ ఫ్యూలింగ్ భూ బాధితులకు న్యాయం తదితర సమస్యలను నూతన ప్రభుత్వం పరిష్కారం చేయాలని కోరారు.

పిల్లల సంపూర్ణ అభివృద్ధికి కృషి

ప్రజాశక్తి-కశింకోట : మూడు నుండి ఎనిమిది సంవత్సరాల పిల్లలలో నిర్మాణాత్మక అభ్యసన పెంపొందించడానికి డిఆర్పిలకు గురువారం స్థానిక డిపిఎం ఉన్నత పాఠశాలలో రెండు రోజుల శిక్షణ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ సందర్భంగా అనకాపల్లి ఎంఇఒ ఎంఎం పట్నాయక్ మాట్లాడుతూ ప్రీ ప్రైమరీ, ఒకటి రెండు తరగతుల పిల్లలు సంపూర్ణ వృద్ధి సాధించడానికి గాను నూతన బోధనా పద్ధతులను మూల్యాంకన విధానాలను ఉపాధ్యాయులందరూ అలవర్చుకొని పాఠశాలలో అమలు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రధాన ఉపాధ్యాయులు ఎమ్‌వి అప్పారావు, డైట్ లెక్చరర్ మాధవి, అనకాపల్లి, మునగపాక మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుని ఇంట్లో 1.5 కిలోల వెండి చోరీ

ప్రజాశక్తి - యలమంచిలి : పట్టణంలోని రంగావారి వీధిలో నివాసముంటున్న ఉపాధ్యాయుని ఎ.హైమావతి ఇంట్లో బుధవారం రాత్రి దొంగలు పడి వెండి వస్తువులు దోచుకున్నారని స్థానిక టౌన్ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... హైమావతి తీర్థయాత్రలకు వెళ్లి బుధవారం ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉన్నాయి. పూజగది, బెడ్ రూములోని సుమారు రూ.1.3 లక్షలు విలువచేసే ఒకటిన్నర కేజీల వెండివస్తువులు చోరీకి గురైనట్లు గుర్తించారు. దీనిపై బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేశారు. యాత్రలకు వెళ్లే ముందు బంగారు ఆభరణాలు లాకర్‌లో పెట్టడంతో పెద్ద ప్రమాదం తప్పింది. దుండగుల వేలిముద్రలు సేకరించడానికి పోలీసు క్లూస్ టీమ్ వచ్చింది. కేసును టౌన్ పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఎవరైనా ఇల్లు విడిచి ఎక్కడికైనా వెళ్లి నట్లయితే ఆ సంగతి పోలీసులకు సమాచారం ఇస్తే ముందస్తుగా ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని పోలీసులు తెలిపారు.

భోగలింగేశ్వర ఆలయ ధర్మకర్తల మండలి రాజీనామా

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలోని ప్రసిద్ధిగాంచిన శ్రీభోగలింగేశ్వర ఆలయ ధర్మకర్త మండలి గురువారం రాజీనామా చేసింది. ఈ మేరకు ఆలయ ఈవో ఆదినారాయణకు ఆలయ చైర్మన్ ఆళ్ల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో రాజీనామా సమర్పించారు. గత ఏడాది ఆగస్టు 31న అప్పటి ముఖ్య మంత్రి జగన్ మోహన్ రెడ్డి, మంత్రి గుడివాడ అమర్నాథ్ సిఫార్సుల మేరకు రాష్ట్ర దేవాదాయ ధర్మాదాయ శాఖ తమకు పాలకవర్గ సభ్యులుగా అవకాశం కల్పించిందని తెలిపారు. తమ పదవి కాలంలో సర్వ కామదాంబ అమ్మవారి నవరాత్రులు, కార్తీక మాస, శివరాత్రి ఉత్సవాలు ఘనంగా నిర్వహించామన్నారు. తమ పదవీకాలంలో సహాయ సహకారాలు అందించిన దేవాదాయ ధర్మాదాయ శాఖ, ఈవో ఆదినారాయణ, అర్చకులు సిబ్బంది, తమకు అవకాశం కల్పించిన జగన్మోహన్ రెడ్డి, అమర్నాథ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి- అనకాపల్లి : అనకాపల్లి మండలంలోని 132 కేవీ కశింకోట సబ్ స్టేషన్ పరిధిలోని 33 కేవీ చోడవరం ఫీడర్ మెయింటెనెన్స్ వర్క్స్ కారణంగా 33/11కేవీ అల్లికానుడి పాలెం సబ్ స్టేషన్, 33/11కేవ్ వాటర్ వర్క్స్ పరిధిలో శుక్రవారం ఉదయం 8 నుండి మధ్యాహ్నం ఒంటిగంట వరకు తుమ్మపాల సెక్షన్ పరిధిలోని గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు విద్యుత్‌శాఖ కసింకోట డివిజన్ ఏఈ ఎస్ రామకృష్ణ తెలిపారు. ఏపీఈపీడీసీఎల్ విద్యుత్ వినియోగదారులు అందరూ సహకరించాలని కోరారు.

సబ్బవరం మండలంలో పంచకర్లకు మెజార్టీ

ప్రజాశక్తి- సబ్బవరం
పెందుర్తి కూటమి అభ్యర్థి పంచకర్ల రమేష్ బాబుకు 2024 సార్వత్రిక ఎన్నికల్లో సబ్బవరం మండలంలో భారీ మెజార్టీ లభించింది. మండలంలోని 24 పంచాయతీల్లోనూ, జీవీఎంసీ 88వ వార్డులో మూడు పంచాయతీల్లోని ప్రతి గ్రామంలోనూ మెజార్టీ లభించింది. గ్రామాల వారీగా మెజార్టీ వివరాలు ఇలా ఉన్నాయి... బంగారమ్మ పాలెంలో 488, రాయపుర అగ్రహారం 147, వంగలి 253, అంతకాపల్లి 333, అయ్యన్నపాలెం 190, ఎల్లుప్పి 187, బోదువలస 301, గుల్లేపల్లి 676, మొగలిపురం 312, అమృతపురం 541, మల్లు నాయుడుపాలెం 531, తవ్వవానిపాలెం 528, సబ్బవరం మేజర్ పంచాయతీ 2004, ఇరువాడ 360, టెక్కలిపాలెం 437, ఆరిపాక 489, అసకపల్లి 926, గొల్లల పాలెం 380, పైడివాడ అగ్రహారం 412, గంగవరం 240, నంగినారపాడు 610, వెదుళ్ళ నరవ 681, నల్లరేగుల పాలెం 156, బాటజంగాల పాలెం 78, గాలి భీమవరం 239, గొట్టివాడలో 643 మెజార్టీ ఓట్లు లభించగా పైడివాడ మరికొన్ని గ్రామాలలో కొన్ని ఈవిఎం మెషీన్‌లు సాంకేతిక లోపాల కారణంగా వి.వి ప్యాట్ స్లిప్పులు లెక్కించడం జరిగింది. ఆ మెజార్టీ వివరాలు ఇంకా ఇవ్వాల్సి ఉంది.

కూటమి నాయకుల విజయోత్సవాలు

ప్రజాశక్తి-అనకాపల్లి
రాష్ట్రంలో ఎన్‌డిఎ కూటమి ఘన విజయం సాధించిన సందర్భంగా గురువారం స్థానిక 80 వార్డు, పాత 22వ వార్డు విల్లూరి అక్కయ్య గారి వీధిలో తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు విజయోత్సవాలు నిర్వహించారు. మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా టిడిపి 80వ ఇంఛార్జ్ బొడ్డేడ జోగినాయుడును, పివి రమణను సత్కరించారు. కార్యక్రమంలో బీసీ సెల్ జిల్లా అధికార ప్రతినిధి విల్లూరి రమణబాబు, టిడిపి నాయకులు బుద్ధ భువనేశ్వరరావు బొడ్డేడ మురళి, కర్రి మల్లేశ్వరరావు, కాండ్రేగుల శ్రీను, సోడాలు విల్లూరి సత్తిబాబు, పెంటకోట చంద్రరావు, దాడి త్రినాథ్, బుద్ద సంతోష్, బుద్ద లక్ష్మీఅప్పారావు, బుద్ద విశ్వనాథం, దాడి వెంకటేష్, ఆళ్ల కోటేశ్వరరావు, మల్ల వెంకట అప్పారావు, విల్లూరి సత్యనారసింగరావు, పిళ్ల కాశి, దాడి నూకేష్, దాడి నాయుడు, మళ్ల అడవి నాయుడు తదితరులు పాల్గొన్నారు.

చంద్ర రాజేశ్వరరావు ఆశయ సాధనకు కృషి

రాజేశ్వరరావుకు నివాళులర్పిస్తున్న సిపిఐ నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి
సిపిఐ మాజీ జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ చంద్ర రాజేశ్వరరావు ఆశయాల సాధన కోసం కృషి చేయాలని సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి రాజాన దొరబాబు పిలుపునిచ్చారు. చంద్ర రాజేశ్వరరావు 110వ జయంతి సందర్భంగా సిపిఐ జిల్లా కార్యాలయంలో గురువారం ఆయన చిత్రపటానికి సిపిఐ నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా దొరబాబు మాట్లాడుతూ కృష్ణా జిల్లాలోని జమీందారీ కుటుంబంలో జన్మించిన చంద్ర రాజేశ్వరరావు తన వందల ఎకరాల భూమిని పేదలకు ఉచితంగా పంచిపెట్టిన గొప్ప త్యాగశీలి అని కొనియాడారు. పేదల పక్షాన నిలబడి జమీందారీ వ్యవస్థకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించిన చంద్ర రాజేశ్వరరావు పేదల హృదయాలలో చెరగని ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. కుల, మత, ప్రాంతాలకు వ్యతిరేకంగా ఉద్యమాలు నిర్వహించే గొప్ప వారసత్వం మనకు అందించారని తెలిపారు. పేదల పక్షాన నిలబడి పోరాటం చేయడమే కమ్యూనిస్టుల కర్తవ్యమన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు రెడ్డిపల్లి అప్పలరాజు, నాయకులు సత్యనారాయణ, సత్తిబాబు, పోతురాజు, రమణ, సూరిబాబు, పాల్గొన్నారు.

ముగిసిన పాలిసెట్ కౌన్సెలింగ్

ప్రజాశక్తి-అనకాపల్లి
ఏపి పాలీసెట్ కౌన్సెలింగ్ గురువారంతో ముగిసినట్లు అనకాపల్లి ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్, హెల్ప్ లైన్ సెంటర్ జిల్లా కోఆర్డినేటర్ బివిఎస్ ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు గురువారం రేబాక పాలిటెక్నిక్ కళాశాలలో 1,08,001వ ర్యాంక్ నుండి ఆఖరి ర్యాంకు వరకు ధ్రువపత్రాల పరిశీలన చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 132 విద్యార్థుల ధ్రువపత్రాలను పరిశీలించి ఐసిఆర్ పత్రాలను అందజేశారు. 92 మంది బాలురు, 40 మంది బాలికలు హాజరు అయినట్లు పేర్కొన్నారు. ఏడో తేదీ నుంచి నుండి 10వ తేదీ వరకు వెబ్ ఆప్షన్స్ ప్రక్రియ కొనసాగుతుందన్నారు. జూన్ 11న వెబ్ ఆప్షన్స్ మార్పులు చేసుకోవచ్చని, విద్యార్థులు appolycet.nic.in పోర్టల్‌లో లాగిన్ అయ్యి వెబ్ ఆప్షన్స్ పెట్టుకోవచ్చని పేర్కొన్నారు. అవగాహన లేని వారు హెల్ప్ లైన్ సెంటర్ ఉపయోగించుకోవాలన్నారు. వివరాలకు సిస్టం అడ్మినిస్ట్రేటర్ 8142802794ని సంప్రదించాలని కోరారు.

మాజీ ఎమ్మెల్యే పీలా గోవిందకు సన్మానం

ప్రజాశక్తి-కశింకోట
అనకాపల్లి మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణను మండలంలోని జి.భీమవరం గ్రామ టీడీపీ నాయకులు గురువారం సన్మానించారు. రాష్ట్రంలో టిడిపి ఘనవిజయం సాధించడం పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ద్వారపురెడ్డి సత్తిబాబు, పచ్చికూర విజయ్ రామచంద్ర, హనుమంతు సత్తిబాబు, ముత్తా నాగరత్నం, హనుమంతు మహాలక్ష్మి నాయుడు, గణేష్, కిల్లాడి నాని బాబు పాల్గొన్నారు.

పీలా గోవింద సత్యనారాయణను సన్మానిస్తున్న టిడిపి నాయకులు

మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్యలు

కొణతాలకు అజయ్ కుమార్ లేఖ

ప్రజాశక్తి-అనకాపల్లి
జీవీఎంసీ అనకాపల్లి పరిధిలో మున్సిపల్ స్థలాల ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలని అనకాపల్లి ఎమ్మెల్యేగా ఎన్నికైన కొణతాల రామకృష్ణకు సిపిఐఎంఎల్ కార్యదర్శి పిఎస్ అజయ్ కుమార్ గురువారం లేఖ రాశారు. ముందుగా కొణతాలకు శుభాకాంక్షలు తెలియజేస్తూ అనకాపల్లి జీవీఎంసీ జోనల్ కార్యాలయాన్ని ప్రక్షాళన చేయాల్సిందిగా కోరారు. కోట్లాది రూపాయల మున్సిపల్ స్థలాల ఆక్రమణల విషయంలో అధికారులు కబ్జాదారులకు కొమ్ముకాస్తున్నారని ఆరోపించారు. ముఖ్యంగా పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు కోర్టులను సైతం తప్పుతో పట్టిస్తూ తప్పుడు నివేదికలు ఇస్తున్నారన్నారు.

ఎల్ఐజి క్వార్టర్స్ ఆక్రమణ స్థలాలపై దృష్టి పెట్టాలి

దిగువ స్థాయి వర్గాల కోసం పట్టణంలో నిర్మించిన ఎల్ఐజి క్వార్టర్స్ వద్ద ఒక డోర్ నెంబర్ చూపించి సుమారు 13 సెంట్లు స్థలాన్ని కబ్జా చేశారని తెలిపారు. స్థలంలో భవన నిర్మాణానికి జోనల్ కార్యాలయ అధికారులు ఎలా అనుమతులు మంజూరు చేశారని ప్రశ్నించారు. ఆక్రమణదారులను కాపాడేందుకు కమిషనర్ సైతం లోకాయుక్తకు తప్పుడు సమాచారం ఇచ్చారన్నారు. దీనిపై జీవీఎంసీ కమిషనర్, కలెక్టర్‌తో చర్చించి సమగ్ర విచారణ చేపట్టేందుకు ఐఏఎస్ స్థాయి అధికారిని నియమించాలని కోరారు. విచారణ కమిషన్ ముందు తమ వాదనలు వినిపించేందుకు సిద్ధంగా ఉన్నామని పేర్కొన్నారు.

శంకుస్థాపనకే పరిమితం!

నిండా గోతులతో అధ్వానంగా ఉన్న కొంతలం రహదారి

- ఆరుమాసాలైనా ప్రారంభం కాని రోడ్డు పనులు
- అవస్థలు పడుతున్న ప్రజలు ..పట్టని అధికారులు

ప్రజాశక్తి-రోలుగుంట : రహదారి నిర్మాణానికి శంకుస్థాపన చేసి ఆరు నెలలు కావస్తున్నా, నేటికీ పనులు ప్రారంభించలేదని ఆయా గ్రామాల ప్రజలు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని భోగాపురం జంక్షన్ ఆర్అండ్‌బి రోడ్డు నుండి నందిపురం వరకూ కొంతలం మీదుగా శరభవరం వెళ్లటకు రహదారికి ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గత ఏడాది నవంబర్‌లో రూ.86.41లక్షల ఎపిఎంఎం నిధులు మంజూరు చేసి, నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు. ఇప్పటికి ఆరు మాసాలైన పనులు మాత్రం ప్రారంభించ లేదు. శరభవరం నుండి భోగాపురం వరకు రోడ్డు గుంతలుగా పడటంతో రాకపోకలకు ప్రయాణికులు ఇబ్బందులు పడే పరిస్థితి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. శరభవరం నుండి కొంతలంలో ఉన్న జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థినీ విద్యార్థులు సైకిళ్లపై రావాలన్నా, కాలినడకన పాఠశాలకు చేరాలన్నా అవస్థలు పడుతున్నారు. అలాగే కొంతలం నుండి భోగాపురం జంక్షన్‌కు చేరాలన్నా, అక్కడ నుండి మండల కేంద్రానికి రావాలన్న గోతులమయమైన రహదారిలో ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందోనని బిక్కుబిక్కుమంటూ రాకపోకలు సాగిస్తున్నామని ద్విచక్ర వాహన చోదకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నందిపురం నుండి తరచూ క్వారీ లారీలు వస్తుంటాయి. వాటి వల్ల రోడ్డు పాడౌతోందని, అంతేకాక దుమ్ము,ధూళి రేగడంతో ప్రజలు ఇబ్బందులు పడడమే కాకుండా, అనారోగ్యం పాలవుతున్నారని భోగాపురం సర్పంచ్ బండారు శ్రీనివాసరావు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై అధికారులు దృష్టికి పలుమార్లు తీసుకెళ్లినా పట్టించుకోలేదని వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి, రోడ్డు నిర్మాణ పనులు చేపట్టడంతోపాటు త్వరితగతిన వచ్చే వర్షాల సీజన్‌లోగాపూర్తిచేసి, ప్రారంభించాలని ఆయా గ్రామస్థులు కోరుతున్నారు.

పారిశుధ్యంపై ప్రత్యేక దృష్టి

సమావేశంలో మాట్లాడుతున్న ఎంపిడిఒ

ప్రజాశక్తి -కోటవురట్ల : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఎటువంటి సౌకర్యం జరగకుండా పారిశుధ్యంపై ప్రధానంగా దృష్టి సారించాలని ఎంపిడిఒ కాశీ విశ్వనాథరావు ఆదేశించారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పారిశుధ్యం, తాగునీరు, వీధిదీపాలు, పెండింగ్ పనులు పూర్తిచేయడం ప్రాధాన్యతాంశాలుగా పనిచేయాలని ఆదేశించారు. లబ్ధిదారులందరికీ వన్ టైం సెటిల్మెంట్ డాక్యుమెంట్లు అందజేయాలన్నారు, సచివాలయంలోని అన్ని విభాగాల సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండి, ఎటువంటి ఆరోపణలకు తావులేకుండా సేవలు అందించాలని సూచించారు. ఇన్‌ఛార్జి ఇఒపిఆర్‌డి స్వామినాయుడు పాల్గొన్నారు.

మలేరియా నివారణపై అవగాహన

ప్రజాశక్తి-గొలుగొండ : మండలంలోని చోద్యం విలేజ్ హెల్త్ క్లినిక్ పరిధిలో మలేరియా నివారణ మాసోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా చోద్యం గ్రామంలో మలేరియా, డెంగీ, చికెన్ గున్యా వ్యాధులకు కారణమైన దోమలు, వాటి లార్వాల నివారణపై ప్రజలకు అవగాహన కల్పించారు. పరిసరాలు పరిశుభ్రతపై వివరించారు. వర్షాల సీజన్‌లో ఎక్కడా నీరు నిల్వ ఉండకుండా చూడాలని, మురుగునీటిలో మలేరియా కారక దోమలు, వాటి లార్వాలు వృద్ధి చెందుతాయన్నారు. ప్రతిశుక్రవారం డ్రైడే పాటించడం ద్వారా దోమలు వృద్ధి చెందకుండా చూడొచ్చన్నారు. అనంతరం చిరువ్యాధులకు మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గొలుగొండ పిహెచ్‌సి వైద్యాధికారి శ్యామ్, ఎంపిహెచ్ఎ కృష్ణ, ఎఎన్ఎం నూకరత్నం, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

మాసోత్సవాల్లోఅవగాహన కల్పిస్తున్న డాక్టర్ శ్యామ్

గొలుగొండలో టిడిపి జోరు

- బేజారై డీలా పడిపోయిన వైసిపి
- గత ఎన్నికల మెజార్టీ సీన్ రివర్స్

ప్రజాశక్తి -గొలుగొండ : నర్సీపట్నం నియోజకవర్గంలోని ముఖ్యమైన గొలుగొండ మండలంలో కూటమి ఆధిపత్యం ప్రదర్శించింది. టిడిపి అభ్యర్థి చింతకాయల అయ్యన్నపాత్రుడుకు మండలంలో 3722 ఓట్లు మెజార్టీ వచ్చింది. మండలంలో 27 పంచాయతీల్లో గాను 20 పంచాయతీల్లో టిడిపికి మెజారిటీ రాగా, ఏడు పంచాయతీల్లో వైసిపి మెజార్టీ వచ్చింది. మండలంలో 54 పోలింగ్ బూతుల్లో ఉండగా అందులో 40 పోలింగ్ బూత్‌ల్లో టిడిపికి, 14 పోలింగ్ బూత్ లో వైసీపీకి మెజారిటీలు వచ్చాయి. గతంలో ఎమ్మెల్యే ఎన్నికలకు గొలుగొండ మండలం వైసిపికి 3000 మెజారిటీ రాగా, ఈ ఎన్నికల్లో సీన్ రివర్స్ అయింది.

స్థానిక సంస్థల ఎన్నికల్లో చక్రం తిప్పిన వైసిపి మండలంలోని 27 పంచాయతీల్లో 21 స్థానాల్లోనూ, , 15 ఎంపిటిసి స్థానాలకు గాను ఒకటి మినహా మిగిలినవి కైవసం చేసుకుంది. అయితే అసెంబ్లీ ఎన్నికలు సమయానికి కూటమి పుంజుకొని ఆధిపత్యం సాధించింది.

ఈ అసెంబ్లీ ఎన్నికల్లో మేజర్ పంచాయతీ ఎఎల్ పురంలో అత్యధికంగా 1532 ఓట్లు మెజారిటీని టిడిపి సాధించింది. అలాగే మండలంలో అత్యధికంగా ఎర్రవరం పంచాయతీలో మాత్రమే వైసిపి 122 ఓట్లు మెజార్టీ సంపాదించింది. పంచాయతీల వారీగా ఓట్లను పరిశీలిస్తే కృష్ణదేవిపేటలో టిడిపికి 776, వైసిపికి 476, సిహెచ్ నాగాపురంలో టిడిపికి 610, వైసిపికి 548, కొంకసింగిలో టిడిపికి 596, వైసిపికి 470, ఎఎల్ పురంలో టిడిపికి 2994, వైసిపికి 1462 వైసిపి, లింగంపేట పంచాయతీ, తాళ్ల చీడికాడ గ్రామాలు కలిపి టిడిపికి 508, వైసిపికి 540, చోద్యంలో టిడిపికి 668, వైసిపికి 558, గాదంపాలెం పంచాయతీలో టిడిపికి 242, వైసిపికి 306, అమ్మపేట పంచాయతీలో టిడిపికి 308, వైసిపికి 33, కొత్త మల్లంపేట పంచాయతీలో టిడిపికి 820, వైసిపికి 584, చిన్నయ్యపాలెం పంచాయతీలో టిడిపికి 303, వైసిపికి 369, గొలుగొండ పంచాయతీలో టిడిపికి 1017, వైసిపికి 894, పాత మల్లంపేట పంచాయతీలో టిడిపికి 596, వైసిపికి 600, పప్పుసెట్టిపాలెం పంచాయతీలో టిడిపికి 635, వైసిపికి 462, జోగంపేటలో టిడిపికి 656 వైసిపికి 477, సాలికమల్లవరం పంచాయతీలో టిడిపికి 321, వైసిపికి 231, ఎర్రవరం పంచాయతీలో టిడిపికి 276, వైసిపికి 398, చీడిగుమ్మల ఎన్.కంటారం పంచాయతీలలో టిడిపికి 1471, వైసిపికి 1427, గుండుపాలలో టిడిపికి 1282, వైసిపికి 1171, కొత్త ఎల్లవరంలో టిడిపికి 1187, వైసిపికి 714, పుత్తడి గైరంపేట పంచాయతీలో టిడిపికి 380, వైసిపికి 446, పాకలపాడు పంచాయతీలో టిడిపికి 1214, వైసిపికి 1271, రావనణాపల్లి పంచాయతీలో టిడిపికి 410, వైసిపికి 343, కొమిర పంచాయతీలో టిడిపికి 320, వైసిపికి 217, ఏటిగైరంపేట పంచాయతీలో టిడిపికి 927, వైసిపికి 640 వైసీపీకి ఓట్లు పోలయ్యాయి.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి -కోటవురట్ల : శాఖా గ్రంథాలయాల్లో వేసవి విజ్ఞాన శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. వివిధ అంశాల్లో పోటీలను నిర్వహిస్తున్నారు.

కోటవురట్ల శాఖాగ్రంథాలయంలో గురువారం లైబ్రేరియన్ అప్పలనాయుడు ఆధ్వర్యంలో విద్యార్థులకు వక్తృత్వ పోటీలు నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని, వివిధ అంశాలపై తమ అభిప్రాయాలను వెల్లడించారు. విద్యార్థులకు కథలు పోటీలు

నక్కపల్లిలో నీతికథలను చదువుతున్న చిన్నారులు

నక్కపల్లి : మడలంలోని చినదొడ్డిగల్లు శాఖాగ్రంథాలయంలో గురువారం గ్రంథాలయాధికారి జనార్దన్ ఆధ్వర్యంలో వేసవివిజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు కథలు పోటీలు నిర్వహించారు. ముందుగా విద్యార్థులతో నీతి కథలు చదివించి, నీతిని బోధించారు. విద్యార్థులు ప్రతిరోజూ గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవాటును అలవర్చుకోవాలన్నారు .పుస్తకాలు చదవడం వల్ల విద్యార్థులకు జ్ఞానం పెంపొందుతుందన్నారు. కార్యక్రమంలో సిబ్బంది దేవి పాల్గొన్నారు.

గొలుగొండ : గ్రంథాలయాల సేవలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గొలుగొండ శాఖా గ్రంథాలయాధికారి రాజుబాబు అన్నారు. వేసవి శిక్షణ శిబిరంలో భాగంగా గురువారం విద్యార్థులకు బుక్ రీడింగ్, స్టోరీ టెల్లింగ్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ నెల 7న సమ్మర్ క్యాంపుల ముగింపు సందర్భంగా ఇప్పటివరకు నిర్వహించిన వివిధ పోటీల్లో విజేతలకు బహుమతులు అందజేస్తారన్నారు. సమ్మర్ క్యాంపులు ముగిసిన తర్వాత కూడా విద్యార్థులకు గ్రంథాలయాలకు వచ్చే అలవాటును కొనసాగించాలని, భవిష్యత్‌కు ఇది ఎంతో ప్రయోజనకరమన్నారు.

నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం శాఖా గ్రంథాలయంలో గ్రంథాలయాధికారి పి..దమయంతి ఆద్వర్యంలో గురువారం రీసోర్స్ పర్సన్ పద్మ విద్యార్థులతో పద్యాలు చెప్పించి, వాటి అర్థాలను వివరించారు. రోలుగుంట జెడ్‌పిహెచ్ఎస్ స్కూల్ అసిస్టెంట్ సిహెచ్.రాంకుమార్ కాగితం ఎలా తయారౌతుందో వివరించారు, చెట్లు నరకడం తగ్గాలంటే కాగితాలను వృథా చేయడం మానుకోవాలన్నారు. బలిఘట్టం జెడ్‌పిహెచ్ఎస్ డ్రాయింగ్ ఉపాధ్యాయులు శ్రీను బొమ్మలు వేసే విధానాన్ని విద్యార్థులకు వివరించారు.

పాయకరావుపేట : స్థానిక శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం భాగంగా ఉదయం పుస్తక పఠనం, పుస్తక సమీక్ష, డైరీ రాయడంపై అవగాహన కల్పించారు. విశ్రాంత ఉపాధ్యాయులు ఏ సీతారామయ్య విద్యార్థులకు కథలు చెప్పడం, హిందీ గ్రామర్ నేర్పించారు. విద్యార్థులు సమ్మర్ క్యాంపులో నేర్చుకున్న భగవద్గీత శ్లోకాలపై పోటీలు నిర్వహించగా, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. న్యాయనిర్ణేతలుగా యోగామాస్టర్ వై.అచ్యుతరావు, ఎన్‌టి సీతారామమూర్తి వ్యవహరించారు.

చీడికాడ : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా విద్యార్థులకు జనరల్ నాలెడ్జ్, పదాలతో ఆటల పోటీలను నిర్వహించినట్లు లైబ్రేరియన్ ఎఎస్ఎల్ఎస్ జోగేశ్వరి తెలిపారు. పోటీల్లో విజేతలుగా నిలిచిన విద్యార్థులకు ముగింపు రోజున బహుమతులను అందజేస్తామన్నారు.

భీమునిపట్నం : స్థానిక శాఖా గ్రంథాలయంలో గురువారం విద్యార్థులకు పుస్తక పఠనంపై శిక్షణ ఇచ్చారు. ఇంగ్లీష్ పుస్తకాలు చదివించారు. వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో శాఖా గ్రంథాలయ అధికారి మహేష్, ఉపాధ్యాయులు సత్యనారాయణ పాల్గొన్నారు. పలు పోటీలు నిర్వహించారు.

ములగాడ : మల్కాపురంలోని శాఖా గ్రంథాలయంలో గురువారం చిత్రలేఖనంలో వర్క్‌షాప్ నిర్వహించారు. ప్రముఖ చిత్రకారులు ద్వారపూడి శ్రీనివాస్ మనోహర్ చిన్నారులకు చిత్రలేఖనంలో శిక్షణ ఇచ్చారు. ప్రతి ఒక్కరూ రంగులను ఎంపిక చేయడంలో, చిత్రాలను వేయడంలో శ్రద్ధ తీసుకోవాలని చెప్పారు. ఆయన అనేక చిత్రాలను బోర్డుపై వేసి విద్యార్థులకు చూపించారు. అనంతరం నృత్యం, గానంలో పోటీలను నిర్వహించారు. కార్యక్రమంలో జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్.భాగ్యలక్ష్మి, గ్రంథాలయాధికారి వి.అజయ్‌కుమార్, ప్రముఖ రచయిత కె.సత్తిరాజు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక : స్థానిక శాఖ గ్రంథాలయంలో జరుగుతున్న వేసవి విజ్ఞాన శిబిరం గురువారం కూడా కొనసాగింది. ఉపాధ్యాయులు బి గణేష్ విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మండల విద్యాశాఖ సిఆర్‌పి బి.అచ్యుతకృష్ణ మాట్లాడుతూ చిత్రలేఖనం ద్వారా మానసిక వికాసం పెరుగుతుందని, మానసిక ఒత్తిడిని జయించి విద్యార్థులు ఉన్నత శిఖరాలకు చేరుకోగలరని తెలిపారు. గ్రంథాలయ అధికారి ఎల్వి రమణ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

సబ్బవరం : స్థానిక శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా గురువారం విద్యార్థులకు యోగాసనాలపై శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా శాఖ గ్రంథాలయ అధికారి వి శిరీష మాట్లాడుతూ యోగాసనాల వలన మానసిక ఉల్లాసం, శారీరిక దారుఢ్యం పెంపొందించుకోవచ్చని చెప్పారు.

సీతారామస్వామి దేవాలయ చైర్మన్ పదవికి
కన్నయ్యశెట్టి రాజీనామా

పద్మనాభుని కన్నయ్యశెట్టి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నంలోని పురాతన సీతారామస్వామి దేవాలయ చైర్మన్ పదవికి పద్మనాభుని కన్నయ్యశెట్టి గురువారం రాజీనామా చేశారు. వైసిపి ప్రభుత్వ హయాంలో దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్మన్‌గా నియమితులైన కన్నయ్యశెట్టి, ఆ పార్టీ ఓటమితో తాను రాజీనామా చేశారు. రాజీనామా పత్రాన్ని సంబంధిత ఆలయ కార్యనిర్వహణ అధికారికి, ఆలయ అర్చకులకు మెయిల్ ద్వారా పంపించారు. దీనికి సంబంధించి ఆలయ అర్చకులు రేజేటి శ్రీనివాసాచార్యులు మాట్లాడుతూ సీతారామస్వామి ఆలయానికి గత ప్రభుత్వం ధర్మకర్తల మండలిని నియమించిందని,నలుగురు సభ్యులతో కూడిన ధర్మకర్తల మండలికి చైర్మన్‌గా పద్మనాభుని కన్నయ్యశెట్టిని నియమించారన్నారు. ప్రస్తుత ఆలయ అర్చకులు ఎక్స్ అఫీషియల్ మెంబర్ ఆలయ నిర్వహణ చేశారన్నారు. తాజా ఎన్నికల ఫలితాలతో ఆలయ చైర్మన్ పదవికి పద్మనాభుని కన్నయ్యశెట్టి స్వయంగా రాజీనామా చేశారు.

పూర్తయిన ధ్రువపత్రాల పరిశీలన

పాలిసెట్ సర్టిఫికెట్ వెరిఫికేషన్‌లో అధికారులు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్ : నర్సీపట్నం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో పాలీసెట్ 2024 సర్టిఫికేట్ వెరిఫికేషన్ ప్రక్రియ గురువారంతో పూర్తయినట్లు ప్రిన్సిపాల్ రామచంద్రరావు తెలిపారు. చివరిరోజున 108001 ర్యాంకు నుంచి చివరి ర్యాంకు వరకు మొత్తం 85 మంది విద్యార్థులకు సర్టిఫికేట్ వెరిఫికేషన్ చేశారు. ఈ నెల 7 నుండి 10వ తేదీ వరకు ఆప్షన్ ఎంట్రీ, వెబ్ ఆప్షన్స్ జరుగుతాయని, 11న ఆప్షన్ ఎంట్రీ, వెబ్ ఆప్షన్స్ మార్పులు చేసుకోవచ్చునని సూచించారు. విద్యార్థులందరూ దగ్గరలో ఉన్న పాలిటెక్నిక్ కళాశాలలోగానీ ఇంటర్నెట్ సెంటర్‌లోగానీ వెబ్‌ఆప్షన్ ఎంట్రీ, మార్పులు చేసుకోవచ్చని,విద్యార్థుల తమ పాస్‌వర్డ్‌ను ఇతరులకు చెప్పొద్దని సూచించారు.

చురుగ్గా పిహెచ్‌సి అదనపు భవన నిర్మాణం

పిహెచ్‌సి అదనపు భవన నిర్మాణ పనులు

ప్రజాశక్తి-రోలుగుంట : మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం అదనపు భవన నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. 2018లో ఆరోగ్య కేంద్రానికి బిల్డింగ్ నిర్మించారు. దాంతో పాటు 2023లో అదనపు బిల్డింగ్ ఏర్పాటుకు ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ రూ.50లక్షల నిధులు 15వ ఆర్థిక సంఘం నిధులు మంజూరు చేయించారు. ప్రస్తుతం ఆ నిధులతో నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. భవన నిర్మాణం పూర్తయితే, ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులకు, సిబ్బందికి ఉపయోగకరంగా ఉంటుందని స్థానికులు అంటున్నారు.

అద్దింట్లోనే అంగన్వాడీలు!

- శిథిలావస్థలో పలు సొంత భవనాలు
- అవస్థలు పడుతున్న చిన్నారులు, సిబ్బంది
- పలు కేంద్రాల్లో తాగునీటికి కటకట
- తాగునీరు, మరుగుదొడ్లు లేక ఇక్కట్లు
- పట్టించుకోని ఐసిడిఎస్ అధికారులు

ప్రజాశక్తి -కోటవురట్ల : మండలంలో అంగన్వాడి కేంద్రాల పరిస్థితి మరి అధ్వానంగా తయారైంది, అంగన్వాడీ వ్యవస్థ ఏర్పడిన తొలినాళ్లలో ఇక్కడ సిడిపిఒ కార్యాలయం ఏర్పాటు చేశారు అప్పటి నుంచి ఇప్పటివరకు ఉన్న కార్యాలయం ప్రస్తుతం నక్కపల్లి మండలానికి మార్చడంతో, అప్పటి నుంచి అంగన్వాడీ కేంద్రాల మండలంలో మరింత దిగజారిపోయిందనే ఆరోపణలున్నాయి. సంబంధిత అధికారులుగానీ, నేతలు గానీ దీన్ని పట్టించుకునే పరిస్థితి లేదని పలువురు అంటున్నారు.

మండల వ్యాప్తంగా 82 అంగన్వాడీ కేంద్రాలుండగా, వాటిల్లో 23 కేంద్రాలు అద్దె కొంపలో కొనసాగుతున్నాయి, నాలుగు మాత్రం రెంట్ ఫ్రీలో కొనసాగుతుండగా, జల్లూరు, నీలిగుంట, చిన్న బొడ్డేపల్లి, తంగేడు, రామచంద్రపాలెం అంగన్వాడీ కేంద్రాల భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. మరో ఐదు భవనాల్లో ఆందోళనకరంగా విధులు నిర్వహిస్తున్నారు, నాడు నేడు నిధులతో చౌడువాడ, పీకే పల్లి, ఎండపల్లి, గ్రామాలలో కొత్త భవనాలు నిర్మిస్తున్నారు. అయితే అవి పూర్తికావాల్సి ఉంది. మరికొన్ని భవనాల్లో తాగునీరు, మరుగుదొడ్ల సౌకర్యం లేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై అధికారులకు, నాయకులకు ఎన్నిసార్లు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని లబ్దిదారులతోపాటు చిన్నారుల తల్లిదండ్రులు ఆవేదన చెందుతున్నారు

ఇదిలా ఉండగా కోటవురట్ల పోలీస్ స్టేషన్ వద్ద నూతనంగా నిర్మించిన అంగన్వాడీ కేంద్రం భవనం పూర్తయినా, ప్రారంభానికి నోచుకోలేని పరిస్థితి ఉంది. దీనిపై ఐసిడిఎస్ సూపర్వైజర్ దుర్గాదేవిని వివరణ కోరగా, భవన నిర్మాణం పూర్తయినా, బిల్లులు చెల్లించలేదంటూ కాంట్రాక్టర్ భవనం తాళాలను అప్పజెప్పలేదని దీంతో భవనం ప్రారంభం కాలేదన్నారు.

వెంకటాపురం గ్రామంలో అద్దింట్లో అంగన్వాడీ కేంద్రం

పి.కొత్తపల్లి అంగన్వాడీ కేంద్రం వద్ద పాడైన బోరు

పేటలో అనిత రికార్డుల మోత..!

- 43,727 ఓట్ల మెజారిటీతో ఘన విజయం
- 15 ఎన్నికల్లో పూర్వ మెజార్టీ రికార్డు బ్రేక్
- అన్ని మండలాలు, అన్ని రౌండ్లలో ఆధిక్యత
- కూటమి శ్రేణుల్లో వెల్లువెత్తిన ఉత్సాహం

విజయకేతనం చూపిస్తున్న ఎమ్మెల్యే అనిత

ప్రజాశక్తి -నక్కపల్లి : ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల ఫలితాల్లో పాయకరావుపేట నియోజకవర్గంలో కూటమి బలపరిచిన టిడిపి ఎమ్మెల్యేగా గెలుపొందిన వంగలపూడి అనిత రికార్డుల మోత మోగించారు. పేటలో మునుపెన్నడూ, ఎవరికీ రాని విధంగా అత్యధిక ఓట్ల మెజార్టీ సాధించి, పూర్వ రికార్డులన్నింటినీ బద్దలు కొట్టారు .ప్రత్యర్థి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుపై 43,727 ఓట్ల మెజారిటీతో అనిత విజయం సాధించడంతో కూటమి శ్రేణులు ఉత్సాహంతో మునిగితేలుతున్నారు. అన్ని రౌండ్లలోనూ, అన్ని మండలాల్లోనూ అనిత ఆధిక్యతను ప్రదర్శించుకుంటూ వచ్చారు.
1952లో పాయకరావుపేట నియోజకవర్గం ఏర్పడిన దగ్గర నుండి 2019 వరకు 15 సార్లు ఎన్నికలు జరిగాయి. 2019 సార్వత్రిక ఎన్నికల్లో తెలుగుదేశం నుండి బరిలో దిగిన డాక్టర్ బి బంగార్రయ్యపై వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి గొల్ల బాబూరావు 31189 ఓట్ల మెజారిటీతో గెలుపొందారు.. అప్పటివరకు జరిగిన ఎన్నికల ఫలితాలను బట్టి చూస్తే గొల్ల బాబూరావు అత్యధిక మెజారిటీ సాధించి రికార్డు నెలకొల్పారు. .ఆ రికార్డును ఇప్పుడు అనిత బద్దలు కొట్టారు.
2014లో తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసిన అనిత, అప్పటి ప్రత్యర్థి వైసిపి అభ్యర్థి చెంగల వెంకటరావుపై 2828 ఓట్లు స్వల్ప మెజారిటీతో మాత్రమే గెలిచారు. అయితే తాజా ఎన్నికల్లో మాత్రం పేట ఎమ్మెల్యే స్థానానికి ఇప్పటివరకు జరిగిన 15 ఎన్నికల్లో నమోదైన మెజార్టీ రికార్డును చెరిపేసిన అనిత, 43,727 ఓట్ల మెజారిటీతో ఘనవిజయం సాధించడం చర్చనీయాంశంగా మారింది. 4న సార్వత్రిక ఎన్నికల ఓట్ల లెక్కింపులో ప్రతి రౌండ్‌లోనూ, అలాగే నియోజకవర్గంలోని నాలుగు మండలాల్లో అనిత ఆధిక్యతను ప్రదర్శించుకుంటూ వచ్చారు. ప్రస్తుత ఎన్నికల్లో అనితకు 1,20,042 ఓట్లు రాగా, వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుకు 76,315 వచ్చాయి .కోటవురట్ల మండలంలో 4478, పాయకరావుపేట మండలంలో 11,479, ఎస్ రాయవరం మండలంలో 12,978, నక్కపల్లి మండలంలో 13, 155 ఓట్ల ఆధిక్యతను సాధించిన అనిత, పోస్టల్ బ్యాలెట్ ఓటింగ్‌లోనూ 1637 ఓట్ల మెజార్టీ సాధించి, ఓవరాల్‌గా ,ప్రత్యర్థి వైసిపి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులుపై 43,727 ఓట్ల బంపర్, రికార్డుస్థాయి మెజారిటీతో ఘన విజయం సాధించి రికార్డు నెలకొల్పారు.

జీవాల పెంపకంలో
శాస్త్రీయ మెళకువలపై అవగాహన

సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ నరసింహులు

ప్రజాశక్తి - మాడుగుల : జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలపై జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో అవగాహన సదస్సును నిర్వహించారు. మాడుగులలోని అగ్రి ల్యాబ్ ఆవరణలో పాడేరు వెటర్నరీ డివిజన్ ఉపసంచాలకులు డాక్టర్ సిహెచ్ నరసింహులు ఆధ్వర్యంలో నిర్వహించిన సదస్సులో మాడుగుల ఏరియా పశువైద్యశాల పరిధిలోని వీరనారాయణం, చీడికాడ, మాడుగుల మండలాల పశు వైద్యాధికారులు, పారా వెటర్నరీ సిబ్బంది, పశుసంవర్ధక సహాయకులు,గోపాలమిత్రలు పాల్గొన్నారు. వీరందరికీ జాతీయ లైవ్ స్టాక్ మిషన్ ఆధ్వర్యంలో జీవాల పెంపకంలో శాస్త్రీయ యాజమాన్య మెళకువలను డాక్టర్ సిహెచ్ నరసింహులు వివరించారు.

లింగ నిర్ధారిత వీర్యం, రైతు భరోసా కేంద్రాల క్లస్టర్స్ గ్రేడింగ్, 1962 అంబులెన్సు సేవలు, మిల్క్ యాక్ట్, గొంతువాపు వ్యాధి నిరోధక టీకాలు వేయడం వంటి శాఖపరమైన అంశాలపై రెండు మండలాల పశుసంవర్ధకశాఖ యంత్రాంగంతో నర్సింహులు సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో పశుసంవర్ధకశాఖ మాడుగుల ప్రాంతీయ సహాయ సంచాలకులు డాక్టర్ చిట్టి నాయుడు పాల్గొన్నారు.

వర్షాలతో చిత్తడిగా ఆర్‌టిసి కాంప్లెక్స్ రోడ్డు

ప్రజాశక్తి-గొలుగొండ : ఇటీవల అడపాదడపా కురుస్తున్న వర్షాలకు గొలుగొండ మండలం కృష్ణదేవిపేట ఆర్టీసి బస్‌కాంప్లెక్స్ చిత్తడిగా మారింది. దీంతో ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. దీనిపై గతంలో ఎన్నోసార్లు ఆర్‌టిసి యాజమాన్యానికి ఫిర్యాదు చేసినా ఎటువంటి స్పందన లేదని పలువురు ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వర్షం కురిసినప్పుడల్లా కాంప్లెక్స్ ఆవరణలో బురదగా మారుతోందని, దీనిపై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు

బురదమయంగా కేడీపేట కాంప్లెక్స్ రోడ్డు